ప్రజాశక్తి

బుధవారం 10 జనవరి 2024 | 8 పేజీలు





ఎన్‌టిఆర్ | కృష్ణా



మచిలీపట్నంలో నిర్వహించిన జైల్‌భరోలో నేతలను అడ్డుకుని అరెస్టు చేస్తున్న పోలీసులు





విజయవాడలో జరిగిన జైల్‌భరోలో మహిళా నేతలను అరెస్టు చేస్తున్న పోలీసులు

సమ్మెలు ఉధృతం

- కొనసాగుతున్న ఆందోళనలు
- కార్మిక, ప్రజా సంఘాల జైల్ భరో
- నేతల అరెస్టు
- ఉపాధ్యాయుల నిరసన

అంగన్వాడీలు, మున్సిపల్, సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యాన విజయవాడ, మచిలీపట్నంలో మంగళవారం జైల్‌భరో నిర్వహించారు. ప్రభుత్వ తీరుపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నేతలు అరెస్టయ్యారు. మచిలీపట్నంలో ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పులమాలలు వేసి అక్కడ నుండి కలక్టరేట్ వరకు ర్యాలీగా బయలుదేరారు. మార్గమధ్యంలో కార్మిక, ప్రజా సంఘాల నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వారి మధ్య తోపులాటలు చోటుచేసుకున్నాయి. అయినా నేతలు బారికేడ్లను దాటుకుని కలెక్టరేట్ ఎదుట బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అప్పటికే అక్కడ మొహరించి ఉన్న పోలీసులు వారిని బలవంతంగా అరెస్ట్ చేసి చిలకలపూడి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం వ్యక్తి గత పూచి కత్తుపై విడుదల చేశారు. అలాగే విజయవాడ లెనిన్ సెంటరులో ఆందోళనకు పూనుకున్న నేతలను అరెస్టు చేసి వివిధ స్టేషన్లకు తరలించారు. మరోవైపు మున్సిపల్, అంగన్వాడీల ఆందోళనలు మంగళవారం కూడా కొనసాగాయి. ప్రభుత్వం ఉక్కుపాదం మోపినా వెరవకుండా సమ్మెలను కొనసాగించారు. పెద్దఎత్తున ఆందోళన సాగించారు. అలాగే విజయవాడలో దీక్షకు ఉపక్రమించిన ఉపాధ్యాయ సంఘాల నేతలను పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం వివిధ కళ్యాణ మండపాల్లో వారిని నిర్బంధించారు.

(పూర్తి వివరాలు మెయిన్, టాబ్లాయిడ్ లోపలి పేజీల్లో)



విజయవాడలో యుటిఎఫ్ నేతలను అరెస్టు చేస్తున్న పోలీసులు



వీధులన్నీ గబ్బు గబ్బు

- పారిశుద్ధ్యం నిర్వహణ అస్తవ్యస్తం
- పేరుకుపోయిన 9 వేల టన్నులకుపైగా చెత్త
- మున్సిపల్ కార్మికుల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం

ప్రజాశక్తి - విజయవాడ : తమ సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కార్మికులు 15 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో నగరంలో పారిశుధ్యం స్తంభించింది. కార్మికుల సమస్యల పట్ల ప్రభుత్వం మొండివైఖరిని అవలంభిస్తుండడంతో వీధులన్నీ చెత్త, వ్యర్థాలతో నిండిపోయి గబ్బుకొడుతున్నాయి. వారి సమస్యల పట్ల సానుకూలంగా వ్యవహరించాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యంతో పట్టించుకోవడం లేదు. దీంతో ప్రజలు రోడ్లపై ముక్కులు మూసుకొని నడవాల్సి వస్తోంది. వారాల తరబడి ఎక్కడి చెత్త అక్కడే ఉండిపోవడంతో వీధులు కుళ్లి కంపుకొడుతున్నాయి. దీంతో ఎక్కడ రోగాల బారిన పడతామోనని ప్రజలు భీతిల్లిపోతున్నారు. వీధులన్నీ డంపింగ్‌యార్డులను తలపిస్తున్నాయి. ఏ వీధి చూసినా చెత్త కుప్పలతో దర్శనమిస్తున్నాయి. డ్రైన్లు పూడిపోయి పొంగిపొర్లుతున్నాయి. అండర్ గ్రౌండ్ డ్రైనేజి (యుజిడి) మాన్‌హోళ్లు పొంగుతున్నాయి. అయినా అటు ప్రభుత్వం, ప్రజాప్రతినిధుల్లోగానీ, ఇటు అధికారుల్లోగానీ ఎటువంటి చలనం లేకుండా పోయింది. విజయవాడ నగర పాలక సంస్థలోని పబ్లిక్‌హెల్త్, వాటర్, డ్రైనేజి, పార్కులు తదితర తొమ్మిది విభాగాలకు చెందిన సుమారు ఐదు వేల మంది మున్సిపల్ కార్మికులు సమ్మె చేస్తున్నారు. విజయవాడ నగరంలో రోజుకు 700 టన్నుల వరకు చెత్త, ఇతర వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయి. కార్మికుల సమ్మె కారణంగా కేవలం 60-70 టన్నుల చెత్తను మాత్రమే వాహనాల ద్వారా బయటకు తరలిస్తున్నారు. మిగిలిన 630 టన్నులకుపైగా చెత్త రోజూ నగర వీధుల్లో పేరుకుపోతోంది. నగరంలోని 64 డివిజన్లలో సుమారు 9 వేల టన్నులకుపైగా చెత్త వీధుల్లో పేరుకుపోయింది. దీనిని తొలగించే నాధుడు లేడు. బందరు రోడ్డు, ఏలూరు రోడ్డు, బెంజిసర్కిల్ తదితర ప్రధాన రహదారుల్లో శాశ్వత, పోటీ కార్మికులతో అడపాదడపా పారిశుధ్య పనిని చేయిస్తున్నారు. అతి తక్కువ మంది కార్మికులతో పారిశుధ్య నిర్వహణ చేపట్టలేక ప్రజారోగ్య విభాగం అధికారులు, దిగువ స్థాయి సిబ్బంది తీవ్ర ఆందోళన చెందుతున్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, క్లాప్ ఆటో డ్రైవర్లకు రూ.18,500 వేతనం ఇవ్వాలని తదితర పలు డిమాండ్లను పరిష్కరించాలని 15 రోజులుగా మున్సిపల్ కార్మికులు రోడ్డెక్కారు. వారి సమస్యల పట్ల ప్రభుత్వంలో ఎటువంటి చలనం లేకపోవడంతో ఇటు ప్రజలు, ఇటు కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



విజయవాడ కృష్ణలంకలో పేరుకుపోయిన చెత్త

ఖర్చులకు నిధులేవీ?

- అంబేద్కర్ విగ్రహావిష్కరణ సన్నాహక కార్యక్రమాలకు ప్రభుత్వం ఆదేశం
- ఇప్పటికే పేరుకుపోయిన ప్రోటోకాల్ బిల్లుల బకాయిలు

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణకు ఆదేశాలు జారీ చేస్తున్న ప్రభుత్వం నిధులు విడుదలలో మాత్రం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. విజయవాడలో ఏర్పాటు చేసిన 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం, స్మృతివనం ప్రారంభోత్సవ సన్నాహంగా జిల్లాల్లో కార్యక్రమాల నిర్వహణకు ప్రభుత్వం షెడ్యూల్‌ను విడుదల చేసింది. అయితే వాటి నిర్వహణ ఏర్పాట్లకు అవసరమైన కనీస ఖర్చులకు నిధులను మాత్రం విడుదల చేయలేదు. ఇప్పటికే ప్రొటోకాల్ ఖర్చులకు లక్షలు వెచ్చించి బిల్లులు రాక అవస్తలు పడుతున్న కొందరు అధికారులు తాజా కార్యక్రమాల నిర్వహణకు చేతిచమురు వదులుతుందని ఆందోళన చెందుతున్నారు. వివిధ శాఖల అధికారులు ప్రొటోకాల్‌కు రూ.10 లక్షలకుపైగా వెచ్చించారు. ఈ బిల్లులు ఎప్పటికి వస్తాయో తెలియని పరిస్థితి నెలకొంది. తాజాగా భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహావిష్కరణకు సంబంధించి ఈనెల 13న జిల్లా స్థాయి సన్నాహక సమావేశాన్ని మచిలీపట్నంలోని జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాలులో నిర్వహించడానికి జిల్లా యంత్రాంగం సిద్ధమైంది. ఈ సందర్భంగా అంబేద్కర్ ఫొటో ఎగ్జిబిషన్‌తోపాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. విజయవాడలోని నూతన విగ్రహ ఆవిష్కరణకు ముందే జిల్లావ్యాప్తంగా ఉన్న అంబేద్కర్ విగ్రహాలను ఆకర్షణీయంగా అలంకరించాల్సి ఉంది. దీనిలో భాగంగా విగ్రహాలకు రంగులు వేయడం, విగ్రహ పరిసరాలను శుభ్రపరచడం చేయాలి. అంబేద్కర్ జీవితం, రచనలు తదితర అంశాలపై పాఠశాలలు, కళాశాలలు, యూనివర్శిటీల స్థాయిలో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ఇవ్వాల్సి ఉంది.

రానున్న ఎన్నికల్లో పోటీ చేస్తాం

ఆల్ తెలుగు ప్రజా పార్టీ జాతీయ అధ్యక్షులు శివభాగ్యరావు



ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: ఆల్ తెలుగు ప్రజా పార్టీ రాబోవు ఎన్నికలలో 175 అసెంబ్లీ నియోజకవర్గాలలో, 25 పార్లమెంటు నియోజకవర్గాలలో అభ్యర్థులను పోటీకి దించుతుందని జాతీయ అధ్యక్షులు డాక్టరు కె.శివభాగ్యరావు అన్నారు నగరంలోని ఓ హోటల్లో మంగళవారం విలేకరులలో ఆయన మాట్లాడుతూ 12 గ్యారెంటీ హామీలతో ప్రచారం నిర్వహిస్తామన్నారు. ఆంధ్ర రాష్ట్రంలో రాజ్యాధికారమే అంతిమ లక్ష్యంగా ముందుకు వెళుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టేట్ స్పోర్ట్స్ పర్సన్ డా. తమనం విజయ్ కుమార్, స్టేట్ కన్వీనర్ నమ్మి అప్పారావు యాదవ్, వైస్ ప్రెసిడెంట్ కె రవికుమార్, చింతల కృష్ణ ద్రాక్షారం సూరిబాబు, రిక్కా గురుమూర్తి, ధనాలకోటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా కిట్లు పంపిణీ



ప్రజాశక్తి-విజయవాడ: నేటి యువతరం చదువులోనే కాదు క్రీడల్లో కూడా ముందంజలో ఉండాలని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మీ అన్నారు. రెండో దశ మండలం స్థాయిలో క్రీడలు నిర్వహించనున్న నేపథ్యంలో విజయవాడ నగర పాలక సంస్థ మేయర్ రాయన భాగ్యలక్ష్మి మంగళవారం 144 సచివాలయం పరిధిలో గెలిచిన క్రీడాకారులకు, మండలం స్థాయిలో పాల్గొనేందుకు ప్రొఫెషనల్ కిట్స్, టీ షర్ట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నేటి యువతరం చదువులోనే కాకుండా క్రీడల్లో కూడా ముందంజలో ఉండాలని, నేటి యువతరంలో దాగున్న టాలెంట్ వెలికి తీసేందుకే పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: మండలంలోని కె అగ్రహారం ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఉచిత ట్యాబులను మంగళవారం ప్రధానోపాధ్యాయులు పాండు, సర్పంచ్ ఆవుల శ్రీనివాసరావు, స్కూల్ చైర్మన్ అంగిరేకుల తిరుపతిరావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి అధ్యక్షులు పసుపులేటి శ్రీనివాసరావు, వైస్ సర్పంచ్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ భవన్ పనుల పరిశీలన

ప్రజాశక్తి-నందిగామ: బాబుజగ్జీవన్‌రామ్ భవన్ అభివృద్ధి పనులను నందిగామ ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహన్‌రావు మంగళవారం పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మున్సిపల్ సాధారణ నిధులు రూ.22 లక్షల అంచనా వ్యయంతో బాబుజగ్జీవన్‌రామ్ భవన్‌ను కార్పొరేట్ ఫంక్షన్ హాల్స్‌కు ధీటుగా అభివృద్ధి చేసామన్నారు. త్వరలో ప్రారంభోత్సవానికి సన్నాహాలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జయరాం, ఎఇ ఫణి శ్రీనివాస్, ముస్లిం చైతన్య వేదిక అధ్యక్షులు దుబాయ్ కరిముల్లా, యాకూబ్ అలీ పాల్గొన్నారు.

వాహనాలు తనిఖీ

ప్రజాశక్తి-గంపలగూడెం: ఎన్టీఆర్ జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎస్ఐ రాంబాబు తనిఖీలు చేపట్టారు. మంగళవారం మండలంలోని తెలంగాణ- ఆంధ్ర సరిహద్దు గ్రామమైన రాజవరంలో ఉన్న చెక్ పోస్ట్ వద్ద వాహనాలను తనిఖీ చేశారు. పలు వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు.

యుటిఎఫ్ నిరసన

ప్రజాశక్తి-గంపలగూడెం: యుటిఎఫ్ నేతల అరెస్టులను ఖండిస్తూ తోటమూల రింగ్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద మంగళవారం నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కోటేశ్వరరావు, కోట శ్రీనివాసరావు, రాధాకృష్ణ , వసంతరావు, కృష్ణయ్య, మురళీ, రాజారావు పాల్గొన్నారు.




విజయవాడలో మోకాళ్లపై నిరసన



ఇబ్రహీంపట్నంలో...



వన్‌టౌన్‌లో...

15వ రోజుకు మున్సిపల్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి-విజయవాడ: మునిసిపల్ కార్మికుల సమ్మె మంగళవారం నాటికి 15వ రోజుకు చేరింది. కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఇంజినీరింగ్ కార్మికులకు స్కిల్డ్, సెమి స్కిల్డ్ వేతనాలు మంజూరు చేయాలని కోరుతూ కార్మికులు చేసిన నినాదాలు మారుమ్రోగాయి. మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. విజయవాడ ధర్నాచౌక్‌లో జరిగిన కార్యక్రమానికి ఎపి మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నగర అధ్యక్షులు ఎస్ జ్యోతిబాస్ అధ్యక్షత వహించగా ఎపి మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కార్మికుల కోర్కెలు పరిష్కరించడానికి ప్రభుత్వం ముందుకు రావాలని డిమాండ్ చేశారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చిగురుపాటి బాబూరావు మాట్లాడుతూ కార్మికులతో పెట్టుకున్న ఏ ప్రభుత్వం కూడా మనుగడ సాగించలేదని హెచ్చరించారు. యూనియన్ గౌరవాధ్యక్షులు దోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల సమస్యలను పరిష్కరించే తీరిక లేకుండా వ్యవహరిస్తుందని దుయ్యబట్టారు. నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ (ఎసిజి) శకుంతల, ఆయా విభాగాల ఉన్నతాధికారులతో యూనియన్ నేతలు విఎంసిలో చర్చలు జరిపారని, అయినా స్థానిక సమస్యలను సైతం పరిష్కరించే పరిస్థితి అధికారులకు లేకుండా పోయిందని అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు టి తిరుపతమ్మ, మార్తమ్మ, గార్లపాటి లక్ష్మీ, టి ప్రవీణ్, నాగరాజు, మహేష్, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు. **జగ్గయ్యపేట:** మున్సిపల్ కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎన్టీఆర్ సర్కిల్ వద్ద కళ్లకు నల్ల రిబ్బన్లు కట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కార్మికులకు ఎన్టీఆర్ జిల్లా టిడిపి అధ్యక్షులు, మాజీ మంత్రి నెట్టెం రఘురాం మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మేక వెంకటేశ్వర్లు, మైనేని రాధాకష్ణ, కన్నెబోయిన రామలక్ష్మి, గింజుపల్లి రమేష్, ప్రజా సంఘాల నాయకులు కోటా కష్ణ, రావెళ్ళ శేషు, మున్సిపల్ వర్కర్స్ ఎలకమ్మ, మార్తమ్మ, సమాధానం, వి భాస్కర్, వి వెంకట్, నారాయణ, ప్రసాద్, వాసు, తిరుపతమ్మ తదితర కార్మికులు పాల్గొన్నారు. **ఇబ్రహీంపట్నం:** కొండపల్లిలో మున్సిపల్ కార్మికులు సమ్మె కొనసాగించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి ఎం.మహేష్, కొండపల్లి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సిఐటియు కార్యదర్శి టి.సూరిబాబు, నాయకులు దేవుళ్ళు, రమణ, సురేష్, లక్ష్మయ్య, కృష్ణ, మణికంఠ, సింహాచలం, శ్రీను నరసింహారావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. **తిరువూరు:** తిరువూరు నగర పంచాయతీ కార్యాలయం ముందు పారిశుధ్య కార్మికుల ఆందోళన కొనసాగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి బి.వెంకటేశ్వరరావు, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు చాపలమడుగు నాగరాజు, మోదుగు సురేష్, ఎం.నాగరాజు పాల్గొన్నారు. **నందిగామ:** నందిగామలో మున్సిపల్ పారిశుధ్య కార్మికులు పొర్లు దండాలు పెడుతూ నిరసన తెలిపారు. సిఐటియు నందిగామ మండల కార్యదర్శి కటారపు గోపాల్, సైదా, నరేష్, మాణిక్య తదితరులు పాల్గొన్నారు. **వన్‌టౌన్:** విఎంసి కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సిఐటియు పశ్చిమ సిటీ కార్యదర్శి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు, 50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికులను ప్రజలను ఇబ్బందులు పాలు చేస్తున్న ముఖ్యమంత్రి మొండివైఖరిని నిరసిస్తూ మంగళవారం వన్‌టౌన్ నెహ్రూ బొమ్మ సెంటర్ నుండి సర్కిల్ వన్ కార్యాలయం మీదుగా కార్మికులు ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కే. సూరిబాబు, కొండలు, ఆదిలక్ష్మి, దుర్గ పాల్గొన్నారు.


జగ్గయ్యపేటలో...


నందిగామలో...



తిరువూరులో...

వైసిపిని సాగనంపాలి : సౌమ్య


కంచికచర్లలో...

ప్రజాశక్తి-కంచికచర్ల: రాబోయే ఎన్నికల్లో వైసిపిని ఇంటికి సాగనంపాలని మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. కంచికచర్ల వసంత కాలనీలో మంగళవారం రాత్రి బాబు షూరిటీ – భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. సౌమ్య ఇంటింటికీ తిరిగి రాష్ట్రంలో వైసిపి అరాచక, అవినీతి పాలన గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా టిడిపి మినీ మ్యానిఫెస్టో బ్రోచర్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు కోగంటి బాబు, పేరకలపాడు సర్పంచ్ మన్నే సాత్విక, నాయకులు గుత్తా రత్నం, అన్నదాత కష్ణ, మాజీ ఎంపిపి అల్లడి కోటేశ్వరరావు, షేక్ జాని, బాజీ, నాగులు, టి లక్ష్మణరావు, రంగిశెట్టి నరశింహారావు తదితరులు పాల్గొన్నారు. **నందిగామ:** నందిగామ పట్టణం 13వ వార్డులో విఘ్నేశ్వర ప్లాజా అపార్ట్మెంట్, శ్రీనివాస నిలయం అపార్ట్మెంట్స్ నందు తంగిరాల సౌమ్య బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సౌమ్య మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం చేస్తున్న అరాచకాలు అవినీతిని ఎండగట్టాలని డిమాండ్ చేశారు.

మెట్రోలో హోల్‌సేల్ ఉత్సవ్

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: మెట్రో క్యాష్ అండ్ క్యారీ హోల్ సేల్ ఉత్సవ్‌ను ప్రారంభించినట్లు మెట్రో మార్కెటింగ్ ఇన్‌ఛార్జి ఏకనాథ్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని మెట్రో స్టోర్లలోనూ ఈ ఉత్సవ్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. అన్ని రకాలైన కిరాణా వస్తువులను కొనుగోలు చేసే వారు ఈఆఫర్లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముఖ్యంగా వ్యాపారస్తులు, చిన్న చిల్లర వ్యాపారులు, కిరాణా కస్టమర్లు, అన్ని వర్గాలకు చెందిన వారు మెట్రో స్టోర్లను సందర్శించవచ్చని తెలిపారు. పండుగల సందర్భంగా ఆఫర్లతో పాటు అందుబాటు ధరల్లో లభ్యమవుతాయని తెలిపారు.

రెస్టారెంట్లలో విజిలెన్స్ తనిఖీలు

ప్రజాశక్తి-విజయవాడ: విజిలెన్స్ అధికారులు, ఫుడ్ సేఫ్టీ అధికారులతో కలిసి పటమట, విజయవాడ పరిసర ప్రాంతం లోని మధురిమ , ఆర్ ఆర్ దర్బార్ రెస్టారెంట్‌లలో మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. హోటల్‌లో అనుసరిస్తున్న ఆహార భద్రతా ప్రమాణాలను పరిశీలించారు. అధికారులు రిఫ్రిజిరేటర్‌లో వండిన ఆహారం నిల్వ ఉంచుట, ఆహార తయారీ ప్రదేశం పరిశుభ్రత లేకపోవుట, ఆహారం ఉంచిన పాత్రలపై మూతలు లేకపోవడం, ప్రామాణికం లేని సలాడ్ ఆయిల్, జీరా సూప్, స్వీట్ సూప్ మరియు బోల్డ్ నూడుల్స్ వంటివి ఉపయోగించుట, ఒకసారి ఉపయోగించిన పోలార్ కాంపోనెంట్ నిర్దేశిత విలువ 25% కంటే ఎక్కువ కలిగిన వంట నూనెని తిరిగి ఉపయోగించుట వంటి ఉల్లంఘనలను గుర్తించారు. అధికారులు నిల్వ ఉంచిన ఆహారం మరియు మిస్‌బ్రాండెడ్ వస్తువుల నుంచి నమూనాలు సేకరించి స్టేట్ ఫుడ్ ల్యాబ్, హైదరాబాద్‌కు విశ్లేషణ నిమితం పంపడం జరిగినది. పైన తెలిపిన ఉల్లంఘనలకు గాను హోటల్ నిర్వాహకులకు నోటీసులు జారి చేసి, పిదప తగు చర్యలు తీసుకోనుటకు పరిపాలన అధికారి మరియు జాయింట్ కలెక్టర్ వారికీ ఫిర్యాదు చేయటం జరిగింది. హోటల్ నిర్వాహకులు అందరు కూడా ప్రామాణికం కలిగిన పదార్థాలు వినియోగించి పరిశుభ్రమైన ప్రదేశం లో ఆహారం తాయారు చేసి నాణ్యమైన ఆహారం వినియోగదారులకు అందచేయాలని రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారి శ్రీ , లేని పక్షములో నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



జెండా పనుల పరిశీలన

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలో జరుగుతున్న పలు అభివద్ధి పనులను మంగళవారం చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర పరిశీలించారు. పట్టణంలో శరవేగంగా నిర్మిస్తున్న 150 అడుగుల జాతీయ జెండా పనులను పర్యవేక్షించారు. సుమారు రూ.35 లక్షల వ్యయంతో జాతీయ జెండా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఎర్రకాలువ వెంబడి 30, 31 వార్డులను కలుపుతూ సుమారు రూ.35 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కొలగాని రాము, గింజుపల్లి వెంకట్రావ్, పందుల రోశయ్య, వైసిపి నాయకులు గింజుపల్లి కృష్ణ, మున్సిపల్ కమిషనర్ సి హెచ్.మల్లేశ్వరరావు, శానిటరీ ఇన్స్పెక్టర్ కె.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.



కొండచిలువ కలకలం

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం కరెంట్ ఆఫీస్‌లో కొండచిలువ ఉండటం మంగళవారం కలకలం రేపింది. దానిని చూసి కార్యాలయంలోని సిబ్బంది భయాందోళన చెందారు. పాములు పట్టే వ్యక్తిని పిలిపించి దానిని పట్టించిన పిదప ఊపిరి పీల్చుకున్నారు. ఇంకా ఏమైనా ఉండవచ్చు ఏమో అని భయంతో సిబ్బంది ఉన్నారు. రాత్రులు కూడా వారు డ్యూటీ చెయ్యాల్సి ఉంటుంది. తగిన చర్యలు తీసుకోవాలని అధికారులు కోరుతున్నారు.

111 మంది రక్తదానం

ప్రజాశక్తి-ఉయ్యూరు : అడుసుమిల్లి గోపాలకృష్ణయ్య మరియు చెరుకు రైతుల సిద్ధార్థ కళాశాలలో మంగళవారం విజయవాడ రూరల్ లయన్స్ క్లబ్ ఆధ్వ ర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 111మంది విద్యార్థులు రక్తదానంచేశారు. కళాశా ల సెమినార్ హాల్ లో ఏర్పాటుచేసిన ఈకార్యక్రమాన్ని కళాశాల ప్రత్యేక అధికారి కె స త్యనారాయణ ప్రారంభించి మాట్లాడుతూ రక్తదానం చేసి మరొకరి ప్రాణాన్ని నిలబె ట్టిన వారవుతారని, 18 నుంచి 60 సంవత్సరాలు వయస్సు లోపు ప్రతిఒక్కరు జీవిత కాలంలో 168 సార్లు రక్తదానం చేయవచ్చన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ వి శ్రీరాం అధ్యక్ష తన జరిగిన ఈకార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కె వేణుకుమార్, కార్యదర్శి వి శ్రీనివాస్, ఉయ్యూరు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఇస్మాయిల్, నూకల సాంబశివరావు, దినవహిప్రసాద్, ఎన్ ఎస్‌ఎస్ ఆఫీసర్ కె శేఖర్, శ్రావణి, ఎన్‌సిసి ఆఫీసర్ పి శ్రీరామ్ తదితరులు పర్యవేక్షించారు.

అవనిగడ్డలో 'బాబు ష్యూరిటీ'

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ పంచాయతీ శివారు సీతాలంక గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు మండలి వెంకట్రామ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్ర మంలో టిడిపి జనసేన ఉమ్మడి మినీ మేనిఫెస్టోలోని హామీలను ఇంటింటికి వెళ్లి వివరిం చడంతోపాటు అందుకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. టిడిపి జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు యా సం చిట్టిబాబు, పార్టీ నాయకులు కర్ర సుధాకర్, జనసేన నాయకులు నాదెళ్ల జేమ్స్, టిడిపి నాయకులు బచ్చు రఘునాథ్, బం డే రాఘవ పాల్గొన్నారు

వీరవల్లిలో 'జన్ భాగీదారీ'

ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్ : ప్రజల భాగస్వామ్యం, సహకారంతోనే గ్రామాలైనా, రాష్ట్ర లైనా, దేశమైనా అభివృద్ధి సాధించగలదని పంచాయితీ కార్యదర్శి శ్యామలరావు అన్నారు.బాపులపాడు మండలం వీరవల్లి గ్రామంలో మంగళవారం నిర్వహించిన జన్ భాగీదారీ (ప్రజాభాగస్వామ్యం) కార్యక్రమంలో భాగంగా అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు.మన దేశ బలం ప్రతి పౌరుడిలోని దేశభక్తిలో ఉందని తెలుపుతూ భారత సంవిధాన ప్రతిజ్ఞ చేయించారు. కార్యవర్గ సభ్యులు పిల్లా రామారావు,కోడెబోయిన బాబి, సచివాలయ సిబ్బంది ప్రసాద్, శివనాగరాజు,ఉదయశ్రీ, ప్రభాకర్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ప్రజాశక్తి-ఉంగుటూరు : గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు అన్ని రకాల పథకాలను చేరువ చేయడానికి ఉపయోగకరంగా ఉంటుందని ఎంపిటిసి ఎన్ విజయకుమారి అన్నారు. మంగళవారం మండల లోని పెద్ద అవుటపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ బి తిరుపతమ్మ అధ్యక్షతన జరిగిన పల్లెకు పోదాం కార్యక్రమంలో పాల్గొన్న విజయకుమారి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అమలు జరుపుతున్న పలు సంక్షేమ పథకాలను ప్రజల్లోకి వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు పిఎసిఎస్ అధ్యక్షులు వై సీ పీ మండల అధ్యక్షులు వింత శంకర్ రెడ్డి ఎం పి డి ఓ శేషగిరిరావు పంచాయతీ కార్యదర్శి బి. దీప్తి పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహావిష్కరణను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-అవనిగడ్డ : అటువంటి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ ఈ నెల 19వ తేదీన విజయవాడలోని స్వరాజ్య మైదానంలో ప్రారంభం కానున్న దష్ట్యా అన్ని వర్గాల ప్రజలు ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేయాలని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు కోరారు. మంగళవారం పార్టీ కార్యాలయం వద్ద విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలను డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి కొనసాగించి సామాజిక న్యాయం కోసం కృషి చేశారన్నారు. ఆయన బాటలోనే ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని రూ404 కోట్ల వ్యయంతో విజయవాడ నడిబొడ్డులో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాల ఆత్మవిమానానికి ప్రతి కానీ ప్రపంచంలో మరెవ్వరూ చేయలేని కార్యక్రమాన్ని జగన్మోహన్ రెడ్డి చేసి చూపించారన్నారు. ఇది బడుగుల సామాజిక న్యాయా నికి దిక్సూచిగా నిలువ్వనుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి తుంగల సుమతి దేవి జడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు గుర్రం బసవయ్య, పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల పార్టీ కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, వైసిపి రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శి గాజుల జయ గోపాల్ పాల్గొన్నారు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమేష్ బాబు

గ్రంథాలయాల అభివృద్ధికి దాతల సహకారం అవసరం



ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం గ్రేడ్ వన్ శాఖ గ్రంథాలయంలో మంగళవారం కంప్యూటర్స్ ప్రారంభో త్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా గ్రంథాలయ చైర్పర్సన్ తిప్పరమల్లి జమలా పూర్ణమ్మ ప్రారంభం చారు. ఈ కంప్యూటర్లను రూ.45000లతో దాతలు జాస్తి వెంకటకృష్ణారావు, నెట్ కనెక్షన్‌కి 4000 రూపా యలు చిమట రామారావు గ్రందాలయానికి అంది చారు. కంప్యూటర్లు పేద ప్రజల కోసం ఉపయోగపడేలా వారి అభివృద్ధికి అన్ని విధముగా ఉపయోగపడేలా ఉపయోగించుకోవాలని పూర్ణమ్మ అన్నారు. అభివృద్ది కమిటీ సభ్యులు చిమట రామారావు, ఆవుటపల్లి పార్థసారధి, విద్యార్థిని విద్యార్థులు, ఇంచార్జ్ గ్రంథాలయ అధికారి డి. బాబురావు పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్యసురక్ష' వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-మోపిదేవి : మోపిదేవి మండల పరిధిలోని అడపావారిపాలెం గ్రామంలో గల పెదకళ్లేపల్లి - 2 గ్రామ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన ఆరోగ్య సురక్ష - 2 కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిం చింది. ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మంగళవారం అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు ప్రారంభిం చారు. పంచాయతీ సర్పంచ్ అరజా సంధ్యారాణి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ గ్రామ కన్వీనర్ పండలనేని శివప్రసాద్ పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో పెదకళ్లేపల్లి పి.హెచ్.సి వైద్యులు నంబూరి శ్రీరామ్, గైనకాలజిస్ట్ డాక్టర్ హిమ వర్ష, ఆర్థో వైద్య నిపులు డాక్టర్ బి శేషు, కంటి వైద్య నిపుణులు భూపాలాచారి శిబిరానికి హాజరైన రోగులను పరీక్షించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బి.రాజేంద్రప్రసాద్, వీఆర్వో గుర్రం వేణు, ఉప సర్పంచ్ అడపా దుర్గాప్రసాద్, గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ కోసూరు శివ నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.



గుడ్లవల్లేరు మండలంలో పాల్గొన్న డాక్టర్లు, ఇతర సిబ్బంది

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని డోకిపర్రు గ్రామ సచివాలయం-1లో ఏర్పాటు చేసిన "జగనన్న ఆరోగ్య సురక్ష రెండవ విడత" కార్యక్రమంలో 448 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు.పలువురికి కంటి పరీక్షలు చేసి అవసరం ఉన్న వారికి కళ్ళ జోళ్ళు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కొడాలి సురేష్ సర్పంచ్ గోసాల జ్యోతి , ఎంపీటీసీ మెరుగు నాగేంద్ర రావు, డాక్టర్ శ్రావ్య, డాక్టర్ అమీర్ పాల్గొన్నారు.

అభయాంజనేయ స్వామిని దర్శించుకున్న కేంద్ర మంత్రి

ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్: కేంద్ర మంత్రి శ్రీ పాద యశో నాయక్ మంగళవారం రాత్రి హనుమాన్ జంక్షన్‌లోని శ్రీ అభయాంజనేయ స్వామిని దర్శించుకున్నారు.బి జె పి జిల్లా సెక్రటరీ శింగవరపు సత్య భాస్కర గణేష్ బాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. తమలపాకులతో ఆయన గోత్రనామాలతో ఆంజనేయ స్వామికి అర్చకులు పూజలు చేశారు. దేవాలయ సాంప్రదాయం ప్రకారం దేవాలయ చైర్మెన్ నేరుసు భూషణం నూతన శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బి జె పి నాయకులు గుత్తికొండ రాజాబాబు, చిరుఒలు బుచ్చిరాజు, ఉన్నమట్ల కబర్ది పాల్గొన్నారు.



కొనసాగుతున్న యార్లగడ్డ చండీహోమం

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరంలో టీడీపీ ఇన్చార్జ్ యార్లగడ్డ వెంకట్రావ్ చేపట్టిన మహాచండి యాగం నిర్విఘ్నంగా కొనసాగుతోంది. రాష్ట్రం అభివృద్ధి చెందాలని, రాష్ట్రప్రజలు సుఖశాంతులతో ఉండాలని, మరో నాలుగు నెల్లలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ భారీ మెజార్టీతో విజయం సాధించి టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలన్న సంకల్పంతో యార్లగడ్డ గన్నవరం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో చండీయాగం చేపట్టారు. ఈనెల 7వతేదీన ప్రారంభించిన ఈ యాగం నాలుగురోజులపాటు కొనసాగి బుధవారం ఉదయం మహాపూర్ణాహుతి సమర్పణతో ముగుస్తుంది. యాగం మూడవరోజైన మంగళవారం ఉదయం యార్లగడ్డ వెంకట్రావ్, జ్ఞానేశ్వరి దంపతులు యాజ్ఞకులుగా చండీయాగ, సుదర్శనయాగ పారాయణ చేశారు.

రూ.23 లక్షల గంజాయి పట్టివేత



మాట్లాడుతున్న సిఐ నరసింహమూర్తి

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మండలం చిన్న అవుటపల్లి వద్ద బోలేరో వాహనంలో తరలిస్తున్న 232 కేజీల గంజాయిని ఆత్కూరు పోలీసులు పట్టు కున్నట్లు హనుమాన్ జంక్షన్ సిఐ నరసింహ మూర్తి మంగళవారం విలేకరులకు తెలిపారు. ఆత్కూరు పోలీస్ స్టేషన్లో ఆయన మీడియాతో మాట్లాడారు. రాజమండ్రి నుండి తమిళనాడుకు బోలేరో వాహనంలో గంజాయిని శశి కుమార్ అనే వ్యక్తి రహస్యంగా తరలిస్తున్నాడు. ఎస్సై సూర్య శ్రీనివాస్ కు వచ్చిన సమాచారం మేరకు.. ఆత్కూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని చిన్న అవుటపల్లి వద్ద వాహనాలను తనిఖీ చేయగా బోలోరో వాహనం లో తీసుకు వెళుతున్న 23 లక్షల విలువైన 232 కేజీల గంజాయి ప్యాకెట్లను సీజ్ చేసారు. ఒక వ్యక్తి పై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఆయన వివరించారు. ఆత్కూరు పోలీసులను అభినందించారు.

కోడికత్తులు కడితే కఠిన చర్యలు : సిఐ



మాట్లాడుతున్న సిఐ

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం సిఐ కనకరావు, ఎస్ఐ లు శ్రీనివాస్, నాగరాజు, నవీన్ లకు వచ్చిన సమాచారం మేరకు మంగళవారం గన్నవరం మండలం కేసరపల్లి గ్రామంలో కోడి కత్తులు కట్టే రెడ్డి జగదీశ్వరరావు వ్యక్తిని రామాలయం వద్ద అతని నివాసంలో అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ... సంక్రాతి పేరుతో గన్నవరం పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో అనధికారికంగా జూదాలు నిర్వహిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో ఎవరైనా జూదాలు నిర్వహించినట్లయితే పోలీసులకు సమాచారం అందించాలని, సమాచారం అందించిన వ్యక్తి వివరాలు గోప్యంగా ఉంచబడతాయన్నారు.

ఆర్‌టిసి సిబ్బందిపై దాడి : ఇరువురు అరెస్టు

ప్రజాశక్తి-చల్లపల్లి : ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్‌పై దాడి చేసిన ఇరువురు వ్యక్తులను అరెస్టు చేసి కోర్టుకు పంపించినట్లు ఎస్సై చినబాబు తెలిపారు. ఎస్సై అందించిన వివరాల ప్రకారం ఆదివారం రాత్రి మచిలీపట్నం నుండి అవనిగడ్డ వైపు వస్తున్న ఆర్టిసి బస్సు ను చల్లపల్లి పడమర వీధికి చెందిన ఈడే మాధవరావు,జంపాన సుధాకర్ రోడ్డు పార్కింగ్ విషయంలో మద్యం మత్తులో ఆర్టీసీ డ్రైవర్ను దుర్భాషలాడి బస్సు అద్దాలను పగలగొట్టి అడ్డు వచ్చిన లేడీ కండక్టర్ ను బూతులు తిడుతూ వీరంగం సృష్టించారు. సమాచారం అందుకున్న పోలీసులు హుటా హుటిన సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి కేసు నమోదు చేశారు. అసభ్యంగా ప్రవర్తించి వీరంగం సృష్టించిన ఇరువురిని కోర్టు రిమాండ్ కు తరలించినట్లు బుధవారం ఆయన తెలిపారు.

రూ.7.5 లక్షల నగదు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి గూడూరు : గూడూరు పోలీసులు లెక్కలు లేని రూ.7.5 లక్షల నగదును స్వాధీనం చేసు కున్నా రు. ఎన్నికల సంద ర్భంగా అప్పడే అక్రమ నగదు రవా ణాపై కృష్ణాజిల్లా పోలీసులు దృష్టి సారించారు. గూడూరు సెంటర్లో పెడన సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం.డి. హబీబ్ భాషా, గూడూరు ఎస్ ఐ శేషు కుమార్ తమ సిబ్బందితో కలిసి మంగళవారం వాహనాలు తనిఖీ లు చేశారు. ఇలా తనిఖీ చేస్తుండగా భీమవరం నుంచి ఒంగోలు వెళ్తున్న నువ్వుల వ్యాపారి నుంచి రూ. 7.50. లక్షల నగదును గుర్తించారు.ఆ నగదుపై ఆధారాలు లేనందున సీజ్ చేశామని, కేసు నమోదు చేశామని సీ. ఐ. హబీబ్ బాషా వివరించారు.

కొనసాగుతున్న క్రికెట్ పోటీలు

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మండలంలోని షేర్ మహమ్మద్‌పేట గ్రామంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలు కొనసాగుతున్నాయి. కోదాడ రోడ్డులో జరుగుతున్న క్రికెట్ పోటీల్లో మొత్తం 12 జట్లు పాల్గొనగా మంగళవారం క్వార్టర్ ఫైనల్ రసవత్తంగా జరిగింది. ఈ నెల 12, 13, 14, 15 తేదీలలో షటిల్, చెస్, క్యారమ్స్, వ్యాసరచన, కబడ్డీ, ముగ్గులు, రన్నింగ్, సైకిల్స్ స్లో, మోకులాగుడు, మ్యూజికల్ చైర్స్, చిన్నపిల్లలకు రన్నింగ్ వంటి పోటీలు నిర్వహించి సంక్రాంతి పండుగ రోజు విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు ప్రజాసంఘాల నాయకులు షేక్ గౌస్ మియా, ఎస్.రామనాథం, షేక్ బడేమియా, కె.శ్రీనివాసరావు తదితరులు తెలిపారు.

మైలవరం నుంచి పోటీకి సిద్ధం : భూలక్ష్మి

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: మైలవరం నియోజకవర్గం నుంచి పోటీకి సిద్ధంగా ఉన్నానని కొండపల్లి మున్సిపాలిటీ 17 వార్డు కౌన్సిలర్ ముప్పసాని భూలక్ష్మి తెలిపారు.



ఇబ్రహీంపట్నంలోని తన నివాసంలో భూలక్ష్మీ మాట్లాడుతూ బీసీలకు పెద్ద పీట వేస్తానన్న టిడిపి జాతీయ అధ్యక్షులు నారాచంద్రబాబు నాయుడు మైలవరం సీటు బీసీలకు కేటాయించాలని, అలా కేటాయించే క్రమంలో తాను పార్టీ తరుపున పోటీలో ఉంటానని అన్నారు. ప్రస్తుతం మైలవరంలో స్థానికత కు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తుండటంతో బలమున్న బీసీ నాయకురాలిగా, స్థానికురాలిగా తనకు సీటు కేటాయించాలని కోరారు.

పేదలకు ఆరోగ్య పరీక్షలు

ప్రజాశక్తి-వీరులపాడు: పేద వర్గాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి జగనన్న



ఆరోగ్య సురక్ష క్యాంపులు ప్రారంభించడం జరిగిందని ఎంపీపీ కోటేరు లక్ష్మి పేర్కొన్నారు. బొడవాడ గ్రామంలో గ్రామ సచివాలయం వద్ద మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు ఫేజ్-2 కార్యక్రమం నిర్వహించారు. పేదలకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శీలం సంధ్య, ఎంపీటీసీ సభ్యులు యాదాల సుజాత, నాయకులు శీలం భాస్కర్‌రెడ్డి, యాదాల దాసు, మాజీ ఎంపిటిసి కర్ల రాణి, నన్నేబోయిన తిరుమలరావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలపై ఎస్మా దుర్మార్గం : సిఐటియు

ప్రజాశక్తి-పెనుగంచిప్రోలు: గత 26 రోజుల నుండి శాంతియుతంగా సమ్మె చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలపై ప్రభుత్వం ఎస్మా ను ప్రయోగిస్తూ జీవో నెంబర్ 2 తీసుకురావడం దుర్మార్గమైన చర్య అని సిఐటియు నాయకులు పేర్కొన్నారు. జీవోను ఉపసంహరించుకోకపోతే సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం ఆడిస్తున్న ఆటలో రాష్ట్ర ప్రభుత్వం ఆడుతూ సమస్యలను పక్కదారి పట్టిస్తుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి దారా నాగేశ్వరరావు, పెద్ది రాజు, తిరుపతయ్య, కొండలు, అంకులు తదితరులు పాల్గొన్నారు.

నిర్బంధాలతో ఉద్యమాన్ని ఆపలేరు : యుటిఎఫ్

ప్రజాశక్తి-విసన్నపేట: ప్రభుత్వం నుండి రావాల్సిన బకాయిల సాధన కోసం యుటిఎఫ్ మంగళవారం చేపట్టిన ధర్నాను అడ్డుకునేందుకు యుటిఎఫ్ నాయకులను ముందస్తు అరెస్టులు, గృహ నిర్బంధాలు చేయటాన్ని యుటిఎఫ్ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి బిసిహెచ్‌వి సూర్యనారాయణ ఖండించారు. నిర్బంధాలతో ఉద్యమాలు ఆగవన్నారు. ఉద్యోగుల న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించేందుకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు.

జనసేన గ్రామ కమిటీలు ఏర్పాటు

ప్రజాశక్తి-రెడ్డిగూడెం : రెడ్డిగూడెం మండలంలోని 13 గ్రామాలకు జనసేన పార్టీ గ్రామ అధ్యక్షులను, గ్రామ కమిటీలను నియమించినట్లు జనసేన పార్టీ రెడ్డిగూడెం మండల అధ్యక్షుడు చాపలమడుగు కాంతారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గం ఇంచార్జ్ అక్కల రామ్మోహనరావు(గాంధీ), నాయకులు పాములపాటి సుందరరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విజయవాడలో ప్రదర్శన



జగ్గయ్యపేటలో...



మైలవరంలో...



నందిగామలో జలదీక్ష



తిరువూరులో...

అంగన్‌వాడీల సమ్మె ఉధృతం

ప్రజాశక్తి-విజయవాడ: అంగన్వాడీల నిరవధిక సమ్మె 29వ రోజుకు చేరింది. స్థానిక అలంకార్ సెంటర్ ధర్నా చౌక్‌లో రాష్ట్రవ్యాప్త 24 గంటల నిరాహార దీక్షలో 26 మంది పాల్గొన్నారు. మంగళవారం దీక్షలను సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు ప్రారంభించి మాట్లాడారు. అంగన్‌వాడీల సమ్మెకు మద్దతుగా కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు నిర్వహించిన జైల్‌భరో కార్యక్రమం తీవ్ర ఉద్రిక్తతలు, అరెస్ట్‌లకు దారి తీసింది. లెనిన్ సెంటర్ నుంచి ధర్నా చౌక్ వరకు వస్తున్న భారీ ప్రదర్శన, ర్యాలీని అలంకార్ సెంటర్‌లో పోలీసులు అడ్డుకొని రోప్‌పార్టీసాయంతో ముందుకు కదలనీయకుండానే ఆయా సంఘాల నేతలను 57 మందిని అరెస్ట్ చేశారు. వీరిలో 30 మందిని కృష్ణలంక పోలీస్టేషన్‌కు, మరో 27 మందిని పూర్ణానందపేటలోని చాంద్ కళ్యాణ మండపంనకు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు, ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవీంధ్రనాద్, జి ఓబులేసు, ఐఎఫ్‌టియు రాష్ట్ర నాయకులు రవిచంద్ర, ప్రసాద్, సిఐటియు రాష్ట్ర కార్యదర్శులు కె ధనలక్ష్మీ, ఆర్‌వి నరసింహారావు, దయా రమాదేవి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు, అధ్యక్షులు దడాల సుబ్బారావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి పివి ఆంజనేయులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కోటా కళ్యాణ్, సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ వెంకటేశ్వరరావు, ఎన్‌సిహెచ్ శ్రీనివాస్, ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి కె శ్రీదేవి, శ్రామిక మహిళా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ కమల తదితరులు అరెస్ట్ అయిన వారిలో ఉన్నారు. సొంత పూచీకత్తుపై నేతలను సాయంత్రం విడుదల చేశారు. **మైలవరం:** ఇబ్రహీంపట్నం మండలానికి చెందిన మూడు సెక్టార్ల అంగన్వాడీ కార్యకర్తలు నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి సిహెచ్ సుధాకర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జి కొండూరు మండల కార్యదర్శి బాలకృష్ణ, పుష్పకుమారి, శారద, బుల్లెమ్మ, రబ్బాని, మాణిక్యం, విజయలక్ష్మి, నిర్మల తదితరులు పాల్గొన్నారు. **జగ్గయ్యపేట:** పట్టణంలోని తహసిల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీల సమ్మెకు శ్రీరామ్ రాజగోపాల్ సంఘీభావం తెలిపారు. అంగన్వాడీ కార్యకర్తలతో పాటు కళ్లకు నల్లరిబ్బన్లు కట్టుకుని నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి యూనియన్ నాయకులు మధుకుమారి, అంజమ్మ, విశాలాక్షి, సువర్చల, రత్నకుమారి, లక్ష్మీ, మేరి, లీల జానమ్మ, ఉమారాణి, ఖాజాబి, హసీనా, ప్రజా సంఘాల నాయకులు కోటా కష్ణ, రావేళ్ళ శేషు, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బి రాము, టిడిపి నాయకులు మేక వెంకటేశ్వర్లు, మైనేని రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు. **తిరువూరు:** తిరువూరు ఐసిడిఎస్ కార్యాలయం ముట్టడించిన అంగన్వాడీ కార్యకర్తల్లో ఒకరు స్పృహ తప్పి పడిపోయారు. సహచర కార్యకర్తలు ఆమెను వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఆకుల రవి, బి.వెంకటేశ్వరరావు, అంగ న్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు పద్మవతి, నాగమణి, శ్రీలక్ష్మి, సుశీల, ఉష పాల్గొన్నారు. **నందిగామ:** నందిగామలో అంగనవాడీ వర్కర్స్ మునేటిలో మంగళవారం జల దీక్ష చేశారు. మునేటిలో ఇసుకలో కూర్చొని నిరసన తెలిపారు. కాళికాదేవి అవతారంలో జుట్లు విరబూసుకుని భస్మాసుర వదన చేస్తూ అంగనవాడీ వర్కర్స్ ఆందోళన చేసి ప్రభుత్వంపై మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో సిఐటియు ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి కె.గోపాల్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు జి గోపినాయక్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దొండపాటి సుధాకర్, కనకపూడి వెంకటరత్నం, కొల్లి సరళ, వెంకట్రావమ్మ, సుజాత, మహాలక్ష్మి, వేణు, వనిత, పిచ్చమ్మ, ఖాచ్చయిని, రాణి, లక్ష్మీ పాల్గొన్నారు.



జూద క్రీడలు నిర్వహిస్తే చర్యలు : ఎసిపి

ప్రజాశక్తి-మైలవరం: సంక్రాంతి నేపథ్యంలో జూద క్రీడలు నిర్వహిస్తే చర్యలు తప్పవని మైలవరం డివిజన్ ఎసిపి ఎం రమేష్ హెచ్చరించారు. స్థానిక ఎసిపి కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ కోడి పందేల బరులు ఏర్పాటు చేసే వారికి, కోడి కత్తులు తయారు చేసే వారికి, బైండోవర్ చేసిన వారికి కౌన్సిలింగ్ ఇస్తున్నామన్నారు. కోడి పందేల బరులకు ఖాళీ స్థలాలు, మామిడి తోటలు, పొలాలు ఇచ్చిన వారిపై కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సంక్రాంతి పండుగ అయ్యేవరకు సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ ప్రకారం 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. సాంప్రదాయ పద్ధతిలో పండుగను జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిఐ మోహన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీభమర టౌన్‌షిప్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు

విజయవాడ: సంక్రాంతి సందర్భంగా శ్రీభమర టౌన్‌షిప్ ప్రైవెట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు బాపట్ల జిల్లా కొరిశపాడు మండలం రావినూతన గ్రామంలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. పోటీలను శ్రీభమర టౌన్‌షిప్ మేనేజింగ్ డైరెక్టర్ గల్లా రామచంద్రరావు ప్రారంభించారు. రావినూతల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్, ఆర్ఎస్ సీఏ ఆధ్వర్యంలో 16వ తేదీ వరకు 30వ అంతర్‌రాష్ట్ర క్రికెట్ పోటీలు జరుగుతాయని అసోసియేషన్ అధ్యక్షుడు కారుసాల నాగేశ్వరావు తెలిపారు. నాకౌట్ కం లీగ్ పద్ధతిలో జరిగే ఈ పోటీల్లో 16 జట్లు పాల్గొంటాయన్నారు. ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల నుంచి జట్లు ఈ పోటీల్లో పాల్గొంటాయన్నారు. మొదటి బహుమతిగా రూ.3లక్షలు, రెండో బహుమతిగా రూ.2 లక్షలు, మూడో బహుమతిగా రూ.లక్ష అందిస్తున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. ఈ పోటీలకు ముఖ్య అతిథులుగా అఖిల భారత బ్యాడ్మింటన్ కార్యదర్శి కరణం పున్నయ్య చౌదరి, ప్రముఖ సినీనటుడు యర్రా రఘుబాబు, డాక్టర్ బి.జవహర్, ప్రముఖ న్యాయవాది మోహన్‌దాస్ పాల్గొన్నారు.



శ్రీ అక్షర స్కూల్లో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి-కంచికచర్ల: స్థానిక శ్రీ అక్షర ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ లో మంగళవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో భోగి మంటలు వేసి పాత సామాగ్రి మంటల్లో వేశారు. గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసు పాటలు అలరించాయి. పాఠశాల ఆవరణ తోరణాలతో అలంకరించారు. విద్యార్థినులు రంగు రంగుల ముగ్గులు వేశారు. ముగ్గులు పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం పాలపొంగళ్ల చేశారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ కాసరగడ్డ రామారావు, ప్రిన్సిపాల్ వందన సిబ్బంది పాల్గొన్నారు





డాన్‌బాస్కో వార్షికోత్సవ వేడుకలు

విజయవాడ: గురునానక్ నగర్‌లోని డాన్‌బాస్కో స్కూల్ 41వ వార్షికోత్సవ వేడుకలు సోమవారం సాయంత్రం స్కూలు ఆవరణలో వైభవంగా జరిగాయి. ముఖ్య అతిథులుగా ప్రముఖ ఛార్టెడ్ అకౌంటెంట్ కృష్ణార్జునరావు, సిద్ధార్ధ మెడికల్ కాలేజ్ ప్రొఫెసర్, అపోలో లాబ్స్ రీజినల్ హెడ్ డాక్టర్. కళ్యాణ చక్రవర్తి, పూర్వ విద్యార్థి కెనరా బ్యాంక్ ఆఫీసర్ భాస్కరన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కృష్ణార్జునరావు మాట్లాడుతూ స్కూల్‌లోనే విలువలు, నైతికత, బాధ్యతలు అలవడతాయన్నారు. 41 సంవత్సరాల నుండి అదే విలువలతో బాధ్యతాయుతంగా డాన్‌బాస్కో అనేక మంది విద్యార్థులను సమాజానికి అందించిందని కొనియాడారు. నిబద్ధత గల పౌరులను తయారు చేస్తున్నారని పాఠశాల ఉపాధ్యాయులను అభినందించారు. అనంతరం ఈ సంవత్సరం విశాఖ ఎటిఎల్ మారథాన్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతి ప్రధానం చేశారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. బి.వి.ఎన్. ప్రసాద్ వందన సమర్పణ చేశారు.

ప్రజాసంఘాల జైల్‌భరో విజయవంతం

• బందరు కలెక్టరేట్ ఎదుట నాయకుల నిరసన • అరెస్టు, విడుదల

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : అంగన్వాడీ కార్యకర్తలతోపాటు మున్సిపల్, సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని అఖిల భారత కార్మిక సంఘాల, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం జైల్ భరో కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ తొలుత స్థానిక అంబేద్కర్ విగ్రహనికి పులా మలాలు వేసి అనంతరం అక్కడ నుండి కలక్టరేట్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. అయితే మార్గమధ్యలో పోలీసులు కార్మిక,ప్రజా సంఘాల నాయకులను అడ్డుకున్నారు.దీంతో వారి మధ్య మధ్య తోపులాట చోటు చేసుకుని, ఉద్రిక్త పరిస్థితులు నెలకొ న్నాయి. అనంతరం బారి కేడ్లను దాటుకుని కలక్టరేట్ ఎదుట బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అప్పటికే అక్కడ మోహరించి ఉన్న పోలీసులు కార్మిక,ప్రజా సంఘాల నాయకులను బలవంతంగా అరెస్ట్ చేసి చిలకలపుడి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం వ్యక్తి గత పూచి కత్తుపై విడుదల చేశారు. ఈ సందర్భంగా కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు మాట్లాడుతూ సమ్మె చేస్తే కార్మికులను తొలగిస్తామని కార్మికులను బెదిరించిన వారంతా చరిత్రలోకాల గర్భంలో కలిసిపో యారన్నారు. ఎస్మా చట్టాన్ని ఎవరి పై ప్రయోగిస్తారో ముందు తెలుసుకో వాలని హితవు పలికారు. ఎన్నికల ముందు చేసిన వాగ్ధానం ఎన్నికల తర్వాత ఓడ దాటిన తర్వాత బోడి మల్లన్న చందంగా మారిందని ఎద్దేవా చేశారు. అంగన్వాడి కార్యకర్తలకు, మున్సిపల్ కార్మికులకు సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు జరిగే పోరాటాలకు కార్మిక ప్రజా సంఘాల మద్దతు ఎల్లవేళలా ఉంటుందని హామీ ఇచ్చారు.

నాయకుల అరెస్ట్ : వ్యక్తిగత పూచికత్తూ పై విడుదల

అరెస్ట్ అయిన వారిలో కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం హరిబాబు,సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి సిహెచ్ రవి ,మాదాల వెంకటేశ్వరరావుసిఐటియు జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి వై. నరసింహారావు, ఉపాధ్యక్షులు,ఆర్ రఘు, ఎం పోలి నాయుడు.ఆర్ సి పి రెడ్డి, జిల్లా కోశాధికారి బూర. సుబ్రహ్మణ్యం, కల్లం వెంకటేశ్వరరావు, సహాయ కార్యదర్శి కరీముల్లా,మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు కొల్లాటి శ్రీనివాసరావు,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి పవన్, వాకా రామచంద్రరావు, శీలం నారాయణరావు,ఐద్వా జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బసవపూర్ణ,వి జ్యోతి, రజిని, సిఐటియు మండల కార్యదర్సి సిహెచ్ జయరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సమరం, రాజేష్, ఎ ఐ టి యు సి నాయకులు లింగం ఫిలిప్ ఏఐటీయూసీ నాయకులు ఓ ఎల్ రావు , కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ రాజేష్, కార్యదర్శి కే గోపాల్,కె. శర్మ త్రిమూర్తులు, తాడంకి నరేష్, రాజేష్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు, కౌలు రైతు సంఘం నాయకులు పంచకర్ల రంగారావు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ. రమాదేవి, ఉపాధ్యక్షులు నాంచా రమ్మ, మచిలీపట్నం ప్రాజెక్టు ప్రధాన కార్యదర్శి ఏ రజీనా రాణి, కే లక్ష్మి , విజయ్ శ్రీ, గిరిజ, విఠలేశ్వరి తదితరులు ఉన్నారు. ఐఎన్‌టియుసి ,కె.చంద్రశేఖర్ ,నాయకులు ఎండి మతిన్, గౌస్ మొహిద్దిన్, కుమారి,లు పాల్గొన్నారు.



నాయకులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు





21వ రోజుకు సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ,ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల పట్ల ప్రభుత్వం మొండి వైఖరి విడనాడి వెంటనే ఇచ్చిన హామీలను అమలు చేయాలని సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ,ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు పి. పోతురాజు డిమాండ్ చేశారు. మచిలీపట్నం కలెక్టరేట్ వద్ద ధర్నా చౌక్ లో గత 20 రోజులుగా చేస్తున్న సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల నిరవధిక సమ్మె మంగళవారం 21వ రోజుకు చేరుకుంది. ఈ సమ్మెకు జనసేన పార్టీ ఇంఛార్జి బండి రామకష్ణ,నగర కన్వీనర్ గడ్డం రాజు, పామర్రుమండల ఎస్.టి. యు. నాయకులు డి ధనరాజ్ అధ్యక్షులు, శ్రీనివాసరావు కార్యదర్శి,ఎం కిరణ్, ఇతర ఉపాధ్యాయులుతదితరులు పాల్గొని తమ సంఘీభావాన్ని తెలియజేసిన ఈ సమ్మెలో సంఘ ఉపాధ్యక్షులు రాజేష్ బాబు, కోశాధికారి ప్రశాంతి మరియు రాధిక,దుర్గాభవాని, నాగలక్ష్మి అనూష, మాధవరావు ,దినేష్,, సమర్పన్ రావు,, జాన్ మోడీ, సాయికుమార, శ్రీహరి, వివిధ మండలాల నుండి ఉద్యోగులు పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయం విద్యార్థుల ప్రతిభ



ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ సంస్థకు చెందిన కళాకార్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ వారు హైదరాబాద్ లోని గచ్చిబౌలిలో డిసెంబర్ 24న నిర్వహించిన కూచిపూడి కళా వైభవం మహాబంద నత్యంలో భాగంగా ఒకేసారి 7209 మంది కళాకారులు నత్య ప్రదర్శన లో పాల్గొన్నారు. ఈ మహాబంద నత్యం లో మచిలీపట్నం పిఎమ్ శ్రీ కేంద్రియ విద్యా లయ మచిలీపట్నం 7వ తరగతి విద్యార్థులు పెండ్యాల రాఘవ్, యస్విత సాయిలు పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి కళాకార్ బుక్ అఫ్ వరల్డ్ రికార్డ్స్ లో స్థానం పొందారని విద్యాలయ ప్రిన్సిపాల్ మొహ్మద్ ఆసీఫ్ హుస్సేన్ తెలిపారు.ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన విజేతలను ఉపాధ్యాయులు మంగళవారం అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్ : ఆసక్తితో చదివితే పోటీల్లో అత్యున్నత స్థానం సాధించ వచ్చని హెచ్‌ఎం దుర్గాప్రసాద్ విద్యార్థులకు సూచించారు. బాపులపాడు మండలం ఆరు గొలను గ్రామ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికవడంతో సోమవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు లిఖిత, షేబారాణి, వాహినిలు ప్రతిభకనబరచి జనవరి 27.28తేదీల్లో విజాఖపట్నంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం వివరించారు. ఈ కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ చలం ప్రసాద్, ఉపాధ్యాయులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

రసాయన శాస్త్రంలో 'స్పందన'కు డాక్టరేట్



ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : రసాయిన శాస్త్ర విభాగంలో పరిశో ధనకు గాను జంజం స్పందన కృష్ణా విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ పట్టా పొందారు.టీ మాలతిరేఖ పర్యవేక్షణలో సింథసిస్ అండ్ బైలాజికల్ ఇవల్యూషన్ ఆఫ్ 8 – అమినక్యునోలిన్ పిరమిడిన్ అండ్ ఇందొలిజన్ – 6 ఒల్ డెరివేటివ్స్ ' అనే అంశం పై చేసిన పరిశోధనకు ఉపకులపతి ఆచార్య జి జ్ఞానమణి చేతులమీదుగా పట్టా అందుకున్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డా పి వీర బ్రహ్మచారి పాల్గొన్నారు.

కృష్ణా విశ్వవిద్యాలయంలో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : కష్ణా విశ్వవిద్యాలయం రసా యన శాస్త్ర విభాగంలో మంగళవారం సంక్రాతి వేడుకలలో భాగంగా తెలుగు సంప్రదాయాన్ని గుర్తుచేసుకునేలా,తెలుగుదనం ఉట్టిపడేలా ఆట పాటలు విద్యార్థుల ఆనందోత్సాహాల నడుమున సాంఘిక, సంస్కతిక కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా రసాయన శాస్త్ర విభాగంలో విద్యనభ్యశిస్తున్న ఆంధ్రరాష్ట్రం లోని వివిధ జిల్లాలకి చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఆయా జిల్లాల సంస్కతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా వస్త్రధారణలతో ఆకట్టుకున్నారు. ఆయా జిల్లాల లో ప్రసిద్ధిగాంచిన జానపద నత్యాలతో, జానపద గీతాలతో వేడుకలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా విద్యార్థినులకు రంగవల్లుల పోటీలు నిర్వహించిగా విద్యార్థినులు వేసిన రంగవల్లులు సంక్రాంతి శోభను గుర్తు చేసాయి. రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ రామ శేఖరరెడ్డి, రసాయన శాస్త్ర అధ్యాపక మరియు అధ్యాపకేతర సిబ్బంది జి.రవి, డా.కె.పుష్పలత , డా.యస్. రాంబాబు, డా. టి. అనిల్ కుమార్, డా. జి. నరేష్ బాబు. కె . సజిని, మరియు యస్. సుధా రశ్మి లు పాల్గొన్నారు.



కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె



మచిలీపట్నంలో...



బంటుమిల్లిలో...



పామర్రులో...

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : అంగన్వాడి కార్యకర్తల న్యాయమైన డిమాండ్స్ పరిష్కరించాలని శాంతి యుతంగా సమ్మె చేస్తున్న వారిపై ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం దుర్మార్గమైన చర్య అని కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం హరిబాబు అన్నారు. అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ధర్నా చౌక్ లో చేస్తున్న సమ్మె మంగళవారానికి 29వ రోజుకు చేరుకుంది. జన సేన నియోజక వర్గ ఇంఛార్జి బండి రామకృష్ణ, జనసేన పార్టీ నగర అధ్యక్షులు గడ్డం రాజు, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ రమాదేవి, సెక్టార్ అధ్యక్ష ,కార్యదర్శులు నాంచారమ్మ, పి.రెజీనా రాణి,సభ్యులు కే లక్ష్మి ,సుజాత, సౌజన్య విటలేశ్వరి, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. **పామర్రు:** పామర్రులో అంగన్‌వాడీల సమ్మె శిబిరాన్ని యూనియన్ నాయకురాలు రత్నశ్రీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పద్మజ.స్వర్ణలత. వాణి. రాజేశ్వరి మరియు కార్మిక సంఘాల నాయకులు యం విల్సన్ పాల్గొన్నారు. **బంటుమిల్లి :** బంటుమిల్లిలో సమ్మె చేస్తున్న అంగన్ వాడీలకు జై గణేష్ ఆటో యూనియన్ సిఐటియు బంటుమిల్లి లక్ష్మీపురం రూట్ స్టాండ్ ఆటో యూనియన్ నాయకులు మద్దతు తెలియజేశారు. ఆటో యూనియన్ అధ్యక్షులు ఆకునూరి వెంకటేశ్వరరావు, జిల్లా రైతు సంఘం కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు. **అవనిగడ్డ :** అవనిగడ్డ ఐసిడిఎస్ కార్యాల యం ఎదుట నాలుగు మండలాలకు చెందిన అంగన్వాడీ కార్యకర్తలు హెల్పర్లు సమ్మెలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు నిర్మల జ్యోతి, ఏ నాగమణి, కే పాములమ్మ, గాదే సుశీల, కాశీ హంస పాల్గొన్నారు. **మొవ్వ :** మొవ్వలో అంగన్‌వాడీలు మంగళవారం పొర్లుదం డాలతో నిరసన తెలిపారు. ప్రాజెక్ట్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.విజయ లక్ష్మి, రాజారత్నం, కోశాధికారి గంగాభవాని తదితరులు కార్యక్రమాలను పర్యవేక్షించారు. **గుడివాడరూరల్:** సోకాజ్ నోటీసులు జారీ చేస్తుమని ప్రభుత్వం బెదిరింపులకు దిగడం సరికాదని గుడివాడ అంగన్‌వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షురాలు యెండూరి గీత పేర్కొన్నారు. ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట చేస్తున్న సమ్మెలో యూనియన్ కార్యదర్శి తూమేటి వాణి, నందివాడ, గుడ్లవల్లేరు సెక్టార్ నాయకురాళ్లు, తదితరులు పాల్గొన్నారు..



మొవ్వలో పొర్లుదండాలతో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో కేంద్ర మంత్రి నాయక్

ప్రజాశక్తి - గుడ్లవల్లేరు : కేంద్ర పర్యాటక శాఖ మంత్రి శ్రీపాద యస్సో నాయక్ మంగళవారం కృష్ణాజిల్లా గుడ్లవల్లేరులో పర్యటించారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో భాగంగా గుడ్లవల్లేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ ప్రధాని మోడీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు గ్రామాల్లోని ప్రజలకు వివరించేందుకు ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. 2027 నాటికి భారత దేశం ఉన్నత స్థానంలో ఉండేలా ప్రణాళికలు చేస్తున్నారని అన్నారు. కేంద్ర మంత్రి పర్యటన సందర్భంగా ఏర్పాటు చేసిన వ్యవసాయ శాఖ, ఉజ్వల యోజన, స్త్రీ శిశు సంక్షేమ శాఖ (ఐసిడిఎస్), ఆధార్ సేవా కేంద్రం, వైద్య ఆరోగ్య శాఖ స్టాళ్లను ఆయన పరిశీలించారు. ఈకార్యక్రమంలో గుడివాడ ఆర్డీవో పద్మావతి, జిల్లా వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, తహశీల్దారు అబ్దుల్ రెహమాన్ మస్తాన్, ఎంపిడిఒ దారపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఆంధ్రులు గర్వించేలా అంబేద్కర్ స్మృతివనం : మేయర్ రాయన

ప్రజాశక్తి - విజయవాడ : ఆంధ్రులు గర్వించే విధంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్మృతి వనం నిర్మాణాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి చేస్తున్నారని విజయవాడ నగరపాలక సంస్థ మేయర్ రాయిన భాగ్యలక్ష్మి అన్నారు. విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం, 141 సచివాలయంలో ఈనెల 19న స్వరాజ్య మైదానంలో నిర్మిస్తున్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ స్మృతివనం ప్రారంభోత్సవం సందర్భంగా మంగళవారం జన్ బాగిదారి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి మేయర్ రాయన భాగ్యలక్ష్మి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అంబేద్కర్ జీవిత ఔన్నత్యాన్ని వివరించారు. మొదటి పౌరురాలుగా ఆమె సంతకం చేశారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సూచించిన మార్గదర్శకాల్లో నడవాలని ప్రజలకు తెలియపరచటమే కాకుండా అందుకు ప్రతినిత్యం సిద్ధం అని తెలిపే తన సంతకాన్ని జతపరిచారు. అనతరం 46వ డివిజన్ తమ్మిన కష్ణ వీధిలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు రాలిలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ దేశంలో అతిపెద్దదైన 125 అడుగుల ఎత్తైన అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని ప్రభుత్వం నిర్మిస్తోందన్నారు. అలాగే ప్రతి సచివాలయంలో నిర్వహించే జన్భాగ్యర్ధారి కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జనరల్ కె.శకుంతల, మేనేజర్ బి శ్రీనివాస్, డిసిపీ భాస్కర్, కార్పొరేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



ఎంపి కేశినేని భవన్‌పై టిడిపి బ్యానర్లు, జెండాలు తొలగింపు

ప్రజాశక్తి - విజయవాడ : విజయవాడ ఎంపి కేశినేని శ్రీనివాస్ (నాని) కార్యాలయం వద్ద ఉన్న టిడిపి బ్యానర్లు, జెండాలు, హోర్డింగ్‌లను తొలగించారు. ఎంపి కేశినేని నాని, ఆయన కుమార్తె శ్వేత తమ ఎంపి, కార్పొరేటర్ పదవులకు, పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. 11వ డివిజన్ కార్పొరేటర్ పదవికి శ్వేత ఇప్పటికే రాజీనామా చేశారు. త్వరలోనే ఎంపి పదవికి రాజీనామా చేస్తానని కేశినేని ప్రకటించారు. ఈ నేపథ్యంలో కేశినేని భవన్ వద్ద ఉన్న టిడిపి బానర్లను తొలగించారు. వాటి స్థానంలో ఎన్‌టిఆర్, కేశినేని నాని, శ్వేత బ్యానర్లను ఏర్పాటు చేశారు.



సింగ్‌నగర్ సెంట్రల్ డివైడర్లో అందాల పూలహారం

ప్రజాశక్తి - విజయవాడ : పైపులరోడ్డు నుండి కండ్రిక వరకు కొత్తగా నిర్మించిన సింగ్ నగర్ సెంట్రల్ డివైడర్‌లో మంగళవారం అసిస్టెంట్ డైరెక్టర్ హార్టికల్చర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పూల మొక్కలను నాటారు. పచ్చదనంతో, పువ్వుల అందాలతో నగరం అందంగా కనపడాలనే ఉద్దేశంతో బోగన్ విలియలో నాలుగు రకాల మొక్కలతో సెంట్రల్ డివైడర్ కళకళలాడుతోంది. ఈ సందర్భంగా విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ నగరం పచ్చదనం, కాలుష్య రహితంగా ఉండాలని ఉద్దేశంతో బోగన్ విలియా తిమా రకంలో 1600 మొక్కలు, ఎల్లో పూల రకం 1600 మొక్కలు, తెల్ల పూలరకం 1100 మొక్కలు, ఫాక్స్ టైల్ పామ్స్ 123 మొక్కలు నాటి నగరం మరింత అందంగా కనిపించేందుకు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ప్రజలు కాలుష్య రహిత వాతావరణంలో ఉండేందుకు నగరపాలక సంస్థ తన వంతు కృషి చేస్తోందన్నారు.



సెక్యూర్ ఐస్ సైబర్ సెక్యూరిటీ సర్టిఫికేట్ ప్రోగ్రామ్‌కు ఆహ్వానం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : బెంగుళూరుకు చెందిన ప్రముఖ సైబర్ సెక్యూరిటీ సంస్థ సెక్యూర్ ఐస్, ఫిబ్రవరి 2024 బ్యాచ్ కోసం అత్యంత డిమాండ్ ఉన్న సైబర్ సెక్యూరిటీ సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించేందుకు ఉత్సాహంగా ఉంది. సురక్షితమైన వాతావరణాన్ని అభివద్ధి చేయడంలో, పెంపొందించడంలో సైబర్ సెక్యూరిటీ నిపుణులు కీలక పాత్ర పోషిస్తారని సెక్యూర్ ఐస్ సహ వ్యవస్థాపకుడు, సిటిఒ సీమంత పట్నాయక్ నొక్కిచెప్పారు. "అసురక్షిత వాతావరణంలో అభివద్ధి సాధ్యం కాదు, సైబర్ సెక్యూరిటీ నిపుణులు భావోద్వేగాల మధ్య కీలకమైన లింక్, సాధారణ వ్యక్తులు, వ్యాపారాలు, ప్రభుత్వాల భౌతిక భద్రత, ఈ పెద్ద వత్తి చాలా సంతప్తికరంగా ఉంది" అని పట్నాయక్ అన్నారు.

ఒరిజినల్ వైర్‌మెన్ లైసెన్స్ పోయినది

నా క్లయింట్ కృష్ణాజిల్లా, ఉయ్యూరు మండలం, ఉయ్యూరు నగర పంచాయతీ, సుందరమ్మపేట, డోర్ నెం. 2-129/3 వాస్తవ్యులైన ముంజు అప్పలనాయుడు గారి కుమారుడు ముంజు శ్రీనివాసరావు గారు ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రికల్ లైసెన్సింగ్ బోర్డు వారి వైర్‌మెన్ లైసెన్స్ కలిగియున్నారు. వైర్‌మెన్ పర్మిట్ నెం. 0-119051, జారీ చేసిన తేది : 16-06-2016 అయివున్నది. ది.03-01-2024వ తేదీన నా క్లయింట్‌కు చెందిన వైర్‌మెన్ లైసెన్స్ ఒరిజినల్ కాపీని తన మోటారు సైకిల్‌పై పెట్రోల్‌ట్యాంక్ కవర్‌లో పెట్టుకొని, ఉయ్యూరు సెంటర్, అక్కడి నుండి కాటూరు రోడ్డు వెళ్ళుచుండగా మార్గమధ్యంలో ఒరిజినల్ వైర్‌మెన్ పర్మిట్ కాపీ నా క్లయింట్ వద్ద నుండి జారిపడిపోయినది. పైన ఉదహరించిన నా క్లయింట్‌కు చెందిన ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రికల్ లైసెన్సింగ్ బోర్డు వారి వైర్‌మెన్ లైసెన్స్ కలిగియున్నారు. వైర్‌మెన్ పర్మిట్ నెం. 0-119051 ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది చిరునామాకు తెలియజేయవలసినదిగా కోరడమైనది.

టి.చంటిబాబు, ఎం.కాం., ఎల్ఎల్.ఎం.,
అడ్వకేట్ & నోటరీ
కాటూరు రోడ్డు, ఉయ్యూరు.
ఫోన్ : 9393534130, 7075013030

మహారాజశ్రీ గౌరవనీయులైన రెండవ ఆదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు :: నంద్యాల

IP. No. 3/ 2023

Musalaiahgari Bharath Kumar. ...పిటిషనర్

వర్సెస్

1) SDS Ramcides Crop science pvt. Ltd & ఇతరులు ....రెస్పాండెంట్స్

1) SDS Ramcides Crop Science Pvt. Ltd., (Formerly Sree Ramcides Chemical Pvt. Ltd.,) rep. by its Managing Director, D.No. 19-36, Telecom Colony, Near AMC Yard, Gollapudi Village & Post, Vijayawada, Krishna District- 521 225. Cell : 9885634677
3) Progreen Biotech, Rep by its Managing Director Door No. 19/92/2/20, Shop No. 2/20, Ground Floor, MGWC Complex, Mahendra Nagar, Gollapudi Village & Post, vijayawada, Krishna District-521225. Cell : 9985410012
6) Kavitha Life Sciences Rep by its Managing Director, # 76-14-243, Teachers Colony, HB Colony Part, Bhavanipuram, Vijayawada town, Krishna District-520012.

R1,R3, R6, **రెస్పాండెంట్స్‌కు నోటీసు ప్రకటన**

పై I.P దావా నందు పిటిషనర్ తనను దివాలాదారునీగా ప్రకటించమని రెస్పాండెంట్స్ పైన దావా దాఖలు చేసి ఉన్నాడు. పై I.P దావయందు పిటీషనర్, ప్రతివాదులైన R1, R3, R6 లకు పోస్టు ద్వారా కోర్టు ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపిన తీసుకోనందున కోర్టు వారి ఉత్తర్వుల మేరకు పై తేదీన 24-1-2024న వాయిదాకు ఉ.10-30 గంటలకు స్వయముగా గాని, వకీల్ ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను, లేనియెడల మీ అంతటా పరోక్షంగా తీర్మానించబడునని తెలియజేయడమైనది.

వాయిదా తేదీ : 24-1-2024

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

ఇట్లు
A. **శ్రీనివాసశర్మ,**
G. **మద్దిలేటి యాదవ్**
అడ్వకేట్,
నంద్యాల.

IN THE COURT OF THE 1st ADDL. JUNIOR CIVIL JUDGE AT VIJAYAWADA

O.S.NO.860/2020

Between:
Gems Pharma Rep.by its Proprietor R. Chiranjeevi ... Plaintiff

AND

Farmers Agro Farms, Rep. by its Managing Partner, Subrahmaneswara Rao Uppala, S/o. Gopala Krishna Murthy, D.No.1-38, Chilukuru, Near Panchayat Office, Ibrahimpatnam Mandal, Krishna Dist. ... Defendants

పై నెంబరు దావాలోని ప్రతివాది అయిన ఉప్పల సుబ్రహ్మణ్యేశ్వరరావు గారికి వారి యొక్క హాజరు నిమిత్తము శ్రీ కోర్టు వారు ఎన్నిసార్లు సమన్లు పంపిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నందున మీ యొక్క హాజరు నిమిత్తము ది.30-01-2024న వాయిదా అయివున్నది. కావున మీరు ది.30-01-2024న ఉదయం గం.10.30 ని.లకు స్వయముగా గానీ, న్యాయవాది గారి ద్వారా గానీ పై కోర్టు వారి ఎదుట హాజరై ఆక్షేపణలు ఉన్నయెడల తెలుపుకోవలెను. లేనియెడల దావా మీ పరోక్షమున తీర్మానింపబడును.

/// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం ///

వాయిదా తేది: 30-01-2024

దేవరం శ్రీహరి, వాది తరపు న్యాయవాది
కృష్ణలంక, విజయవాడ. సెల్: 9440119775.

IN THE COURT OF THE 1st ADDL. JUNIOR CIVIL JUDGE AT VIJAYAWADA

I.A.NO.269/2022 IN O.S.NO.1025/2022

బిట్వీన్:
కాసాని సత్యకుమారి,
సుంకేసుల ఆదిలక్ష్మి .... పిటీషనర్స్ / వాదులు

మరియు

రేగళ్ళ బుల్లయ్య, రేగళ్ళ శ్రీనివాసరావు,
రేగళ్ళ సాంబశివరావు ... రెస్పాండెంట్స్ / ప్రతివాదలు

టు,
రేగళ్ళ సాంబశివరావు, తండ్రి. (లేటు) కోటయ్య, నివాసం: కాజీపేట, గుంటుపల్లి గ్రామం, ఇబ్రహీంపట్నం మండలం, కృష్ణాజిల్లా.

పై నెంబరు పిటిషన్‌లో మీరు 3వ రెస్పాండెంట్ అయివున్నారు. మీ హాజరు నిమిత్తము వాయిదా తేది. 30-01-2024 అయివున్నది. ఆ రోజున మీరు పైన తెలిపిన కోర్టు వారి సమక్షములో ఉదయం గం.10.30 ని.లకు స్వయంగా గానీ, లేదా మీ తరపు న్యాయవాది ద్వారా గానీ హాజరు కావలెను. అట్లు కాని పక్షమున పై పిటీషన్‌ను శ్రీ కోర్టువారు మీ పరోక్షముగా తీర్మానించెదరు.

/// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు ///

వాయిదా తేది: 30-01-2024

టి.సి.కొలంబస్
విజయవాడ పిటిషనర్స్ తరపు న్యాయవాది
ది.05-01-2024 విజయవాడ

చినపులిపాక గ్రామపంచాయతీ

టెండరు ప్రకటన

కృష్ణాజిల్లా, తోట్లవల్లూరు మండలం, చినపులిపాక గ్రామపంచాయతీ నందు కాంట్రాక్టు లేబరు పద్ధతిపై ది. 1-4-2024 నుండి ది. 31-3-2025 వరకు పనిచేయుటకు సీల్డు టెండర్లు ది.12-1-2024 తేదీ మధ్యాహ్నం 3-00 గం.ల వరకు చినపులిపాక గ్రామ పంచాయతీ కార్యాలయము వద్ద ఈ క్రింది సంతకం చేసిన వారిచేగాని వారి అనుమతి పొందిన వారిచేగానీ స్వీకరించబడి అదేరోజు మధ్యాహ్నం 3-30 గం.లకు హాజరయిన టెండర్లు సమక్షంలో తెరువబడును. ధరావత్తు చెల్లించని టెండర్లను స్వీకరించబడవు. వివరములు కార్యాలయము పనిచేయు వేళల యందు తెలుసుకొనవచ్చును.

వ.నెం.	పనివివరము	పోస్టుల సంఖ్య	కాలపరిమితి	ధరావత్తు
1.	మోటారు ఆపరేటర్	1	1-4-2024 నుండి 31-3-2025 వరకు	500/-
2.	స్వీపరు	1	1-4-2024 నుండి 31-3-2025 వరకు	500/-
3.	ఎలక్ట్రీషియన్	1	1-4-2024 నుండి 31-3-2025 వరకు	500/-

నోట్ : సదరు టెండరుదారులకు శ్రీ కలెక్టర్ (పం.వి) మచిలీపట్నం, కృష్ణాజిల్లా వారి ఉత్తర్వులు వచ్చిన తదుపరి మాత్రమే గ్రామపంచాయతీ నిధుల లభ్యతను అనుసరించి మాత్రమే జీతం చెల్లించబడును. టెండరు షరతులకు లోబడి మాత్రమే పని చేయబడును.

సం/- యస్.అంజనాదేవి
పంచాయతీ కార్యదర్శి,
చినపులిపాక గ్రామం,
తోట్లవల్లూరు మండలం.

బొడ్డపాడు గ్రామపంచాయతీ

టెండరు ప్రకటన

కృష్ణాజిల్లా, తోట్లవల్లూరు మండలం, బొడ్డపాడు గ్రామపంచాయతీ నందు కాంట్రాక్టు లేబరు పద్ధతిపై ది. 1-4-2024 నుండి ది. 31-3-2025 వరకు పనిచేయుటకు సీల్డు టెండర్లు ది.12-1-2024 తేదీ మధ్యాహ్నం 3-00 గం.ల వరకు బొడ్డపాడు గ్రామ పంచాయతీ కార్యాలయము వద్ద ఈ క్రింది సంతకం చేసిన వారిచేగాని వారి అనుమతి పొందిన వారిచేగానీ స్వీకరించబడి అదేరోజు మధ్యాహ్నం 3-30 గం.లకు హాజరయిన టెండర్లు సమక్షంలో తెరువబడును. ధరావత్తు చెల్లించని టెండర్లను స్వీకరించబడవు. వివరములు కార్యాలయము పనిచేయు వేళల యందు తెలుసుకొనవచ్చును.

వ.నెం.	పనివివరము	పోస్టుల సంఖ్య	కాలపరిమితి	ధరావత్తు
1.	మోటారు ఆపరేటర్	1	1-4-2024 నుండి 31-3-2025 వరకు	500/-
2.	స్వీపరు	2	1-4-2024 నుండి 31-3-2025 వరకు	500/-
3.	ఎలక్ట్రీషియన్	1	1-4-2024 నుండి 31-3-2025 వరకు	500/-

నోట్ : సదరు టెండరుదారులకు శ్రీ కలెక్టర్ (పం.వి) మచిలీపట్నం, కృష్ణాజిల్లా వారి ఉత్తర్వులు వచ్చిన తదుపరి మాత్రమే గ్రామపంచాయతీ నిధుల లభ్యతను అనుసరించి మాత్రమే జీతం చెల్లించబడును. టెండరు షరతులకు లోబడి మాత్రమే పని చేయబడును.

సం/- యస్.అంజనాదేవి
పంచాయతీ కార్యదర్శి,
బొడ్డపాడు గ్రామం,
తోట్లవల్లూరు మండలం.

రొయ్యూరు గ్రామపంచాయతీ

టెండరు ప్రకటన

కృష్ణాజిల్లా, తోట్లవల్లూరు మండలం, రొయ్యూరు గ్రామపంచాయతీ నందు కాంట్రాక్టు లేబరు పద్ధతిపై ది. 1-4-2024 నుండి ది. 31-3-2025 వరకు పనిచేయుటకు సీల్డు టెండర్లు ది.12-1-2024 తేదీ మధ్యాహ్నం 3-00 గం.ల వరకు రొయ్యూరు గ్రామ పంచాయతీ కార్యాలయము వద్ద ఈ క్రింది సంతకం చేసిన వారిచేగాని వారి అనుమతి పొందిన వారిచేగానీ స్వీకరించబడి అదేరోజు మధ్యాహ్నం 3-30 గం.లకు హాజరయిన టెండర్లు సమక్షంలో తెరువబడును. ధరావత్తు చెల్లించని టెండర్లను స్వీకరించబడవు. వివరములు కార్యాలయము పనిచేయు వేళల యందు తెలుసుకొనవచ్చును.

వ.నెం.	పనివివరము	పోస్టుల సంఖ్య	కాలపరిమితి	ధరావత్తు
1.	మోటారు ఆపరేటర్	1	1-4-2024 నుండి 31-3-2025 వరకు	500/-
2.	స్వీపరు	3	1-4-2024 నుండి 31-3-2025 వరకు	500/-
3.	ఎలక్ట్రీషియన్	1	1-4-2024 నుండి 31-3-2025 వరకు	500/-

నోట్ : సదరు టెండరుదారులకు శ్రీ కలెక్టర్ (పం.వి) మచిలీపట్నం, కృష్ణాజిల్లా వారి ఉత్తర్వులు వచ్చిన తదుపరి మాత్రమే గ్రామపంచాయతీ నిధుల లభ్యతను అనుసరించి మాత్రమే జీతం చెల్లించబడును. టెండరు షరతులకు లోబడి మాత్రమే పని చేయబడును.

సం/- యస్.అంజనాదేవి
పంచాయతీ కార్యదర్శి,
రొయ్యూరు గ్రామం,
తోట్లవల్లూరు మండలం.

కొండలు..గుట్టలు మాయం

• గన్నవరం మండలంలో యథేచ్ఛగా అక్రమ మట్టి తవ్వకాలు


మట్టి తవ్వుతున్న దృశ్యం

ప్రజాశక్తి-గన్నవరం : అధికారుల అండతో కొంత మంది వ్యక్తులు గన్నవరం మండలంలోని కొండలు, గుట్టలను సైతం వదలడం లేదు.అక్రమ గ్రావెల్ తవ్వకాలకు పాల్పడుతూ ఆదాయ వనరుగా మార్చు కుంటున్నారు. అధికారులకు ఎంతో కొంత ముట్టజెప్పి రూ. లక్షల్లో దోచేస్తున్నారు. ఎవరైనా ఎదురు తిరిగితే బెదిరింపులకు దిగుతున్నారు. మండలంలో గత కొంతకాలంగా సాగుతున్న గ్రావెల్ మాఫియా తీరిది. గొల్లనపల్లిలో సర్వేనంబర్ 88లో కొండ పోరంబోకు భూమి 410 ఎకరాల్లో విస్తరించి ఉంది. అధికార నాయకులకు ఇది ఆదాయ వనరుగా మారింది. అధికారుల అండతో రాత్రి విచ్చలవిడిగా గ్రావెల్ ను భారీ వాహనాల్లో, ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. గన్నవరం, ఉంగుటూరు, విజయవాడ రూరల్ మండలం, విజయవాడ ఇతర ఏరియాలో ఇళ్ల నిర్మాణాలు, లేఅవుట్ల అభివద్ధికి ఈ మట్టినే వినియోగిస్తున్నారు. ఒక్కో టిప్పర్ గ్రావెల్ ధర రూ.10 వేల నుంచి దూరాన్ని బట్టి మరింత వసూలు చేస్తున్నారు. ఇలా నిత్యం 100 నుంచి 150 ట్రిప్పుల్లో కొండ మట్టి తరలిపోతోంది.గతంలో ఓ గ్రామానికి చెందిన కిందిస్థాయి వైకాపా నాయకుడు విజయవాడ లేఅవుట్లకే తరలిస్తున్నామని బహిరంగం గానే చెప్పకొచ్చారు. ప్రస్తుతం ముస్తాబాద్ లో ఇదే తరహాలో గ్రావెల్ ను రాత్రివేళల్లో తరలించేస్తున్నారు. మూడు నెలల నుంచి విజయవాడకు సమీపంలోని లేఅవుట్ల అభివద్ధికి ఇక్కడి నుంచి వందల టిప్పర్లలో మట్టిని తరలించి రూ. లక్షలు దోచేస్తున్నారు. పది రోజుల నుంచి రాత్రి వేళ పెద్ద ఎత్తున ఖాళీ స్థలంలో దిబ్బలుగా తోలి పగటి సమయంలో టిప్పర్లకు ఎత్తి తరలిస్తున్నారు. ఎవరైనా అడిగితే తమ సొంత భూముల నుంచి గ్రావెల్ తోలకుంటున్నామని, తమకు అనుమతులన్నీ ఉన్నాయని చెప్పుకొస్తున్నారు. అధికారులకు నెల మామూళ్లు ముట్టజెప్పి దందా సాగిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. గతంలో స్థానిక రెవెన్యూ అధికారులు రాత్రి, పగలు గ్రావెల్ తరలిస్తున్న చోట నిఘా పెట్టడంతో కొంత వరకు తగ్గింది. ఇటీవల ఓ రెవెన్యూ అధికారికి బెదిరింపులు సైతం రావడం గమనార్హం. ప్రస్తుతం శీతాకాలం కావడంతో గ్రావెల్ మాఫియా కేవలం రాత్రి వేళల్లోనే అక్రమ రవాణా చేస్తున్నారు. చలికి అధికారులు అటువైపు వెళ్లలేని పరిస్థితి. దీనిని ఆసరాగా చేసుకొని కొండల నుంచి గ్రావెల్ ఇష్టారీతిన తవ్వేశారు. ఇప్పటికైనా మైనింగ్ అధికారులు తనిఖీలు చేసి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామాల్లోని ప్రజలు కోరుతున్నారు


మాట్లాడుతున్న ఎంఎల్ఎ కైలే అనిల్‌కుమార్

భూహక్కు పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-పమిడిముక్కల : వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం రైతు పక్షపాత ప్రభుత్వమని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ అన్నారు. మంగళవారం పమిడిముక్కల మండలంలోని ఫాతేలంక గ్రామంలో వైయస్సార్ భూహక్కు పుస్తకాల పంపిణీ చేశారు. అనంతరం ఎంఎల్ఎ మాట్లాడుతూ వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఎప్పుడో 1956 సంవత్సరంలో చేసిన భూపటాలను రద్దుచేసి కొత్తగా భూ హక్కు చట్టం తీసుకొచ్చి రైతులకు మేలు చేసిందన్నారు. జియో మ్యాపింగ్ ద్వారా పొలం సరిహద్దులు నిర్ణయించబడతాయని ఆయన అన్నారు.పమిడిముక్కల మండలం లోని 17 గ్రామాలలో ఈ సర్వే జరుగుతోందని మండల తాసిల్దార్ రాజ్యలక్ష్మి అన్నారు. గ్రామ సభలు పెట్టి రైతుల అభిప్రాయాలను తీసుకుని ఈ సర్వే చేస్తున్నామని తెలిపారు. గుర్రాలంక, అయినపూరు, వీరంకి గ్రామాల్లో సర్వే పూర్తయిందని, మిగిలిన గ్రామాల్లో ఫిబ్రవరి నెలలో పూర్తిచేస్తామన్నారు. గ్రామ సర్పంచ్ ఉదయ తుల్లా, మండల పరిషత్ అధ్యక్షురాలు కాసాని వేద సుప్రజా, మండల ఉపాధ్యక్షులు కొడమంచిలి మహేష్, గంజల సీతారామయ్య, మండల అధ్యక్షులు ఎలమంచిలి గణేష్, పాతూరు చంద్రపాల్, భీమవరపు కష్టారెడ్డి, జొన్నల మోహన్‌రెడ్డి పాల్గొన్నారు

నేడు డయల్ యువర్ డిఎం

ప్రజాశక్తి ఉయ్యూరు : ఉయ్యూరు ఆర్టీసీ డిపో పరిధిలో ప్రయాణికుల సలహాలు, సూచనల స్వీకరణలో భాగంగా బుధవారం ఉదయం 11 నుండి 12 గంటలవరకు డయల్ యువర్ ప్రోగ్రాం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు డిపోమేనేజర కేఎస్ఆర్కె ప్రసాద్ మంగళవారం ఓప్రకటన లలో తెలిపారు. 9959224796 సెల్ నంబరుకు ఫోన్చేసి ప్రయాణికులు సలహాలు, సూచనలు, సమస్యలు తెలియజేయాలని పేర్కొన్నారు.


పోటీలు ప్రారంభిస్తున్న సిఐ కిషోర్‌బాబు

ఆటల పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-పమిడిముక్కల : పమిడిముక్కల మండలం లోని తాడంకి ఉన్నత పాఠశాలలో వాలీబాల్, క్రికెట్ కబడ్డీ ఆటలను పమిడిముక్కల సర్కిల్ సీఐ కిషోర్ బాబు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతికి జూద క్రీడల కన్నా ఆటల పోటీలు మంచిదని అన్నారు. యువకులు జూద క్రీడాలకు బానిసలవ్వకుండా సంప్రాదాయ ఆటల పోటీలు ఆడుకోవాలన్నారు. సంక్రాంతికి కోడిపందేలు, జూద క్రీడలు ఆడితే చర్యలు తీసుకుంటామన్నారు.

'పిఎం విశ్వకర్మ'కు దరఖాస్తు చేసుకోండి

• జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ఆర్. వెంకట్రావు

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : పీఎం విశ్వకర్మ పథకం కింద వివిధ సంప్రదాయ చేతి వృత్తుల వారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ఆర్ వెంకట్రావు సూచించారు.కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జిల్లా పరిశ్రమల కేంద్రం సౌజన్యంతో ప్రధానమంత్రి విశ్వకర్మ పథకంపై సెమినార్- కం - అవగాహన కార్యక్రమం మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ మీటింగ్ హాల్లో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ఆర్. వెంకట్రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేతివృత్తుల మీద ఆధారపడి జీవించేవారు వారి ఆర్థిక అభివృద్ధికి ఈ పథకం దోహదం చేస్తుందన్నారు. ఈ పథకం పట్ల అవగాహన కల్పించి సంప్రదాయ చేతివత్తుల వారు దరఖాస్తు చేసుకోవడానికి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వడ్రంగి, కమ్మరి, స్వర్ణకారులు, సంప్రదాయ బొమ్మల తయారీ, బుట్టలు చాపల తయారీ, తాపి పనివారు, పడవలు తయారు చేసేవారు, సుత్తి మరియు పనిముట్లు చేసేవారు, శిల్పాలు- విగ్రహాలు చెక్కేవారు, చెప్పులు కుట్టేవారు, పూల మాలలు తయారు చేసేవారు, తాళాలు బాగు చేసేవారు, బార్బర్, దర్జీ (టైలర్), చేపల వల తయారు చేసేవారు, వాషర్ మెన్ (ధోబి) వంటి 18 రకాలైన సంప్రదాయ వృత్తులను ఈ పథకం కింద గుర్తించినట్లు తెలిపారు. వీరికి తగిన శిక్షణ ఇవ్వడం తోపాటు బ్యాంకు రుణాలు అందించి వారి ఆర్థిక అభివృద్ధికి తోడ్పడడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డిఆర్డిఏ పిడి పిఎస్ఆర్ ప్రసాద్, డిప్యూటీ లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ మూర్తి, కామన్ సర్వీస్ సెంటర్ స్టేట్ ప్రాజెక్ట్ మేనేజర్ రాజాబాబు, దళిత్ ఎంటర్ ప్రెన్యూర్ అసోసియేషన్ (ఎన్జీవో) కోఆర్డినేటర్ పి నాగ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు


హనుమాన్‌జంక్షన్‌లోని శ్రీచైతన్య పాఠశాలలో...




గన్నవరంలోని సెయింట్ జాన్స్ పాఠశాలలో...

ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్: సంక్రాంతి గంగిరెద్దులు, గొబ్బెమ్మలు, హరిదాసులు వంటివి తెలుగుజాతికి చిహ్నాలని పెదపాడు మండల విద్యాధికారి నరసింహ మూర్తి అన్నారు. స్థానిక హనుమాన్ జంక్షన్ శ్రీ చైతన్య పాఠశాలలో మంగళవారం నాడు నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో ఆయన పాల్గొన్నారు.పాఠశాల ఆవరణాన్ని రంగవల్లులతో, మామిడి తోరణాలతో అలకరించారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులతో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. పాఠశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు ప్రత్యేకమైన ఆకర్షణగా నిలిచింది.భోగి మంటలు ఏర్పాటు చేసి,భోగి మంటలు చుట్టూ చేసిన కోలాటం అందరిని ఆకట్టుకుంది. మండల విద్యాధికారి నరసింహమూర్తి సంక్రాంతి పండుగ గురించి విద్యార్థులకు వివరించి భోగి పండ్లను పోసి ఆశీర్వదించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించి, విద్యార్థులలో ఉత్సాహాన్ని నింపారు. అనంతరం పాఠశాల హెచ్ఎం వి.రాజేష్ అతిథులుగా విచ్చేసిన వారిని సత్కరించి, కతజ్ఞతలను తెలియజేశారు. ఈ సంబరాలలో దెందులూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ అప్పన ప్రసాద్, పెదపాడు ఎంపీపీ రత్నకుమారి, అప్పన వీడు సర్పంచ్ సిహెచ్.ఝాన్సీ, అప్పనవీడు ఎంపీటీసీ జి.రామసీత,శ్రీ చైతన్య పాఠశాల ఏజీయం యస్. పార్థసారథి ,రీజనల్ ఇన్చార్జి ఉదయ భాస్కర్, అకడమిక్ కో-ఆర్డినేటర్ వేంకటేశ్వరరావు పాల్గొన్నారు.**ప్రజాశక్తి - అవనిగడ్డ :** మొవ్వ క్షేత్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మంగళవారం విద్యార్థులకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో ఇంటర్మీడియట్ చదువుతున్న మొదటి రెండు సంవత్సరాల విద్యార్థినిలు 72 మంది వరకు పాల్గొని రంగురంగుల ముగ్గులు వేశారు. విజేతలకు బుధవారం ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్నట్లు ఆ కాలేజీ ప్రధానాచార్యులు కే. ఏ.వి.ఎస్.వి. ప్రసాద శాస్త్రి తెలిపారు. న్యాయ నిర్ణయతలుగా హిస్టరీ అధ్యాపకురాలు పద్మ, ఓ. ఏ .ఎస్. లెక్చరర్లు గౌరమ్మ, రంగనాయకులు వ్యవహరించారు. **ప్రజాశక్తి-గన్నవరం :** సెయింట్ జాన్స్ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో పిల్లలకు సంక్రాంతి సంప్రదాయాన్ని అనుసరించి పిల్లలకు భోగిపళ్ళు , పొంగలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రెవ. బ్రదర్ సంతోష్ కుమార్, పాఠశాల సీనియర్ రెవ. బ్రదర్ జిమ్మి కురియోకోస్, రెవ. బ్రదర్. జయబాలన్, విద్యార్థులు పాల్గొన్నారు.

నవభారత్ హై స్కూల్‌లో సంక్రాంతి సంబరాలు

గన్నవరంలోని నవభారత్ హై స్కూల్‌లో మంగళవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సంక్రాంతి సంబరాల్లో భాగంగా హరిదాసు వేషధారణ, బొమ్మల కొలువు, పిల్లలు గాలిపటాలు ఎగరవేయడం, మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం ముగ్గుల పోటీల యందు పాల్గొన్న మహిళలందరికీ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు అందరూ కూడా సాంప్రదాయ దుస్తులను పాల్గొని అలరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాం డెంట్ షేక్ ఇమామ్ షేక్ జాకీర సుల్తానా, షేక్ హసీనా , అశోక్ రాణి పాల్గొన్నారు. **ప్రజాశక్తి - గుడివాడ :** రంగు రంగుల రంగవల్లులు, సంక్రాంతి పాటలు పాడి, భోగి మంటలు, గంగిరెద్దుల సన్నాయి వాయిద్యాలు, ముత్యాల ముగ్గులు, గుమ్మడి పూలు, గొబ్బిళ్ళు, చిన్నారుల ఆనందోత్సాహాల చిన్నారులు సంప్రదాయ వస్త్రధారణల మధ్య విద్యావికాస్ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు జరిగాయి. మంగళవారం స్థానిక బైపాస్ రోడ్డులోని విద్యావికాస్ పాఠశాల ఆవరణలో సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్లు ముప్పాళ్ళ సుబ్బారావు, కొమ్మినేని సాంబశివరావులు మాట్లాడారు.


గుడివాడలోని విద్యావికాస్‌లో...


గుడివాడలో సంబరాలు చేసుకుంటున్న నాయకులు

ప్రజాసంకల్పయాత్ర వేడుకలు

ప్రజాశక్తి-అవనిగడ్డ : వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి రాకముందు చేపట్టిన ప్రజా సంకల్ప యాత్ర ముగిసి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా ఆమనగడ్డ వైసిపి పార్టీ కార్యాలయం వద్ద వేడుకలు నిర్వహించారు. మంగళవారం కేకులు కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం ఆర్టీసీ బస్టాండ్ సెంటర్లోని వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. ఈ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ తుంగల సుమతి దేవి, జడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ, పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల పార్టీ కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, పార్టీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు గుర్రం బసవయ్య, మాజీ సర్పంచులు నలుకుర్తి పద్వి రాజు సైకం బాబురావు, లంకమ్మ అమ్మవారి టెంపుల్ చైర్మన్ అన్నపరెడ్డి రామదాసు పాల్గొన్నారు. **ప్రజాశక్తి - గుడివాడ :** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన మహా ప్రస్థానం పాదయాత్ర ముగిసి 5ఏళ్ళు పూర్తి చేసుకున్న సందర్భంగా స్థానిక శరత్ థియేటర్‌లోని వైఎస్సార్సీపీ కార్యాలయంలో మంగళవారం పార్టీ నాయకులు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ వైఎస్ఆర్‌సిపి అధ్యక్షుడు గొర్ల శ్రీను, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ ఎంవి నారాయణరెడ్డి, జిల్లా నాయకులు మండలి హనుమంత రావులు దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించి, మహాప్రస్థానం విజయోత్సవ కేక్ కట్ చేశారు. మాజీ కౌన్సిలర్ మాదాసు వెంకట లక్ష్మీ, నాయకులు కొంకితల ఆంజనేయప్రసాద్ పాల్గొన్నారు.

యువత కొత్త ఆలోచనలతో ముందుకు వెళ్లాలి

బివైఎస్‌టి పరివర్తనా సదస్సులో వక్తలు

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: యువత కొత్త ఆలోచనలతో ముందుకు వెళ్లాలని, యువ పారిశ్రామికవేత్తలకు ఎంఎస్‌ఎంఇ (మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్) నుండి పూర్తి సహకారం ఉంటుందని ఎపి ఎంఎస్‌ఎంఇ కార్పొరేషన్ సీఈవో సేథు మాధవన్ అన్నారు. యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సాహం అందించేందుకు హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ ఆధ్వర్యంలో భారతీయ యువ శక్తి ట్రస్టు ఆధ్వర్యంలో నగరంలోని సిద్ధార్థ ఆడిటోరియంలో అవగాహనా కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్హత కలిగిన నిరుద్యోగ యువతకు తగిన విధంగా ప్రోత్సాహం అందించేందుకుగాను భారతీయ యువశక్తి ట్రస్టు ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. ఎంఎస్‌ఎంఇ సంస్థ కొత్తగా పారిశ్రమలు స్థాపించి వారికి తగిన విధంగా ప్రోత్సాహం అందించేందుకు పారిశ్రామికవేత్తలు, వ్యాపార ప్రముఖులతో అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. ఎఫ్‌ట్రానిక్స్ ప్రయివేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ దాసరి రామకృష్ణ మాట్లాడుతూ నేడు ఎన్నో ఉపాధి అవకాశాలు ఉన్నాయని అయితే వాటిని అందిపుచ్చుకోవడంతో యువత ముందుకు రావాలన్నారు. ముఖ్యంగా స్కిల్స్‌ను పెంపొందించుకోవడంతో పాటు ప్రయివేటుసంస్థలు అందించే ప్రోత్సాహకాలను కూడా సద్వినియోగం చేసుకోవాలన్నారు. భారతీయ యువ శక్తి ట్రస్టు చీఫ్ ఆపరేటివ్ ఆఫీసర్ అరుణ వినోద్‌కుమార్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా భారతీయ యువ శక్తి ట్రస్టు కృషి చేస్తుందన్నారు. యువతలో ప్రతిభను గుర్తించే విధంగా బిజినెస్ ఐడియా కాంటెస్టును నిర్వహిస్తున్నామన్నారు. కొత్త



వ్యాపారాన్ని సాధించేందుకు ఎటువంటి సూచనలు వినూత్నంగా ఎవరు చేస్తారో వారికి నగదు ప్రోత్సాహక బహుమతులు కూడా ఇస్తున్నామని తెలిపారు. విజయవాడలో తాము నిర్వహించిన ఈ కార్యక్రమానికి మంచి స్పందన లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో బివైఎస్‌టి నిర్వహణ కమిటీ సభ్యులు పి.మోహన్‌రావు, ఎపి ఇండస్ట్రీస్ జాయింట్ డైరెక్టర్ జి.ప్రసాద్, ఎంఎస్‌ఎంఇ డైరెక్టర్‌జనరల్ డాక్టర్ ఎస్‌గ్లోరీ స్వరూప, బివైఎస్‌టి ఆపరేషన్స్ హెడ్ సౌమిత్ర జోషి, సీనియర్ ఫీల్డ్ ఆఫీసర్ అమర్ పాల్గొన్నారు.



ఎపిడబ్ల్యుజెఎఫ్ డైరీని ఆవిష్కరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి

ఎపిడబ్ల్యుజెఎఫ్ డైరీని ఆవిష్కరించిన సజ్జల

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్) డైరీని మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి ఆవిష్కరించారు. తాడేపల్లిలోని ఆయన కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు, రాష్ట్ర నాయకులు గోరంట్లప్ప, విజయవాడ నగర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.సాంబశివరావు (కలిమిశ్రీ), ఎం.బి.నాథన్, నగర నాయకులు రాఘవేంద్ర శేఖర్, సీనియర్ జర్నలిస్ట్ సురేష్ బాబు కుర్రా పాల్గొన్నారు.


శ్రీ చైతన్యలో వేడుకలు

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: భారతీయ సంస్కృతిలో పరంపరగా వస్తున్న ఆచార వ్యవహారాలు, సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు ఉపాధ్యాయులు పర్వదినం వేడుకలను సంప్రదాయబద్ధంగా నిర్వహించి చిన్నారులలో అవగాహన పెంపొందించాలని కరెన్సీ నగర్ శ్రీ చైతన్య స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు పొట్లూరు సునీత అన్నారు. మంగళవారం పాఠశాల ఆవరణలో భోగి, సంక్రాంతి పండుగల విశిష్టతను చిన్నారులకు దృశ్య రూపంలో వివరించారు. అనంతరం చిన్నారులపై భోగిపళ్లు పోశారు. సంక్రాంతి పండుగ నాడు గృహాలలో నిర్వహించే పూజలను పాఠశాలలో విద్యార్థుల పర్యవేక్షణలో నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకేతర సిబ్బంది మురళీకష్ణ, నరేంద్ర పాల్గొన్నారు.



వెలగలేరులో గోదాములు ప్రారంభం

ప్రజాశక్తి-మైలవరం: వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2.48 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోడౌన్లను నిర్మించామని రాష్ట్ర వ్యవసాయ, సహకార మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని వెలగలేరు గ్రామంలో రూ.10.91 కోట్ల వ్యయంతో నిర్మించిన గోదాములను స్థానిక ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్‌తో కలిసి మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం తీసుకున్న నిర్ణయం వల్ల రాష్ట్రవ్యాప్తంగా రైతులకు ఎంతో ఉపయోగకరమన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించడానికి ఆర్బికేల ఏర్పాటు అంతర్జాతీయ స్థాయిలోనే గర్వించదగ్గ విషయమన్నారు. దేశంలోనే రైతులకు ఉచిత భీమా కలిగించే రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అన్నారు.



ఉత్సాహంగా టెన్నిస్ పోటీలు

ప్రజాశక్తి-హెల్త్ యూనివర్శిటీ: నగరంలోని ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో జరుగుతున్న ఎస్.వి. మెమోరియల్ వలర్డ్ టెన్నిస్ మాస్టర్స్ టోర్నీ ఉత్సాహభరితంగా జరుగుతుంది. వివిధ ఏజ్ కేటగిరిలో జరగుతున్న పోటీలలో విజేతల వివరాలను నిర్వాహకులు తెలియచేశారు. మెన్స్ సింగిల్స్ 45 ప్లస్ కేటగిరిలో బోస్ కిరణ్ నల్లమోతు 6-2, 6-2 పాయింట్లతో సురేంద్ర అల్లంపై విజయం సాధించాడు. 55 ప్లస్ కేటగిరి విభాగంలో కాకకుమాను శ్రీనివాసరావు 6-2, 2-6, 6-2 పాయింట్లతో రవి కిండేపై విజయం సాధించాడు. బుధవారం కూడా వివిధ ఏజ్ కేటగిరిలో పోటీలు జరుగనున్నాయి.





నివాళులర్పిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

సింధుకు కన్నీటి వీడ్కోలు

ప్రజాశక్తి-తాడేపల్లి (గుంటూరు జిల్లా)

అనారోగ్యంతో మృతిచెందిన అన్నపురెడ్డి సింధు (36) అంత్యక్రియలు కన్నీటి వీడ్కోలు మధ్య మంగళవారం తాడేపల్లిలో జరిగాయి. సింధు తండ్రి అన్నపురెడ్డి కోటిరెడ్డి సిపిఎంలో క్రియాశీలకంగా పని చేస్తున్నారు. అనేక మంది సిపిఎం రాష్ట్ర నాయకులతో సహా జిల్లా, స్థానిక నాయకులు సింధు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. పిన్న వయసు లోనే కుమార్తెను కోల్పోయిన కోటిరెడ్డిని సిపిఎం నాయకులు ఓదార్చారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. సింధు అంతిమయాత్ర కొత్తూరులోని ఆమె స్వగృహం నుండి అమరారెడ్డినగర్ పక్కన గల హిందూ శ్మశాన వాటిక వరకు సాగింది. అనంతరం అక్కడ అంత్యక్రియలు నిర్వహించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, మాజీ ఎంపి పి.మధు, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, వి.ఉమామహేశ్వరరావు, సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు, నాయకులు పిల్లలమర్రి బాలకృష్ణ, ఎంబి విజ్ఞాన కేంద్రం కన్వీనర్ పిన్నమనేని మురళీకృష్ణ, సత్తెనపల్లి మాజీ ఎమ్మెల్యే పుతుంబాక భారతి, సిపిఎం నాయకులు ఎం.రవి, జొన్నా శివశంకరరావు, వై నేతాజీ, కె నళినీకాంత్, ఈమని అప్పారావు, బూరుగ వెంకటేశ్వర్లు, దొంతిరెడ్డి వెంకటరెడ్డి, డి.శ్రీనివాసకుమారి పలు ప్రజాసంఘాల నాయకులు సింధు భౌతికకాయంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు.



గీతమ్స్‌లో వేడుకలు

ప్రజాశక్తి-తిరువూరు: తిరువూరు గీతమ్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూలల్లో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సంక్రాంతి వేష దారణలు, పల్లెటూరు వాతావర ణంలో గహాలు ఏర్పాటు చేశారు. గృహాలను తిలకించిన అతిధులు, తల్లిదండ్రులు విద్యార్థులను ప్రశంశించారు. అనంతరం విద్యార్థుల సంస్కతిక కార్యక్రమా లతో పాటు బొమ్మల కొలువు, చిన్నారులకు భోగిపళ్ల మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కర స్పాండెంట్ ఎస్ఎన్‌బి చారి తదితరులు పాల్గొన్నారు.

శ్రీనిధిలో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి-తిరువూరు: తిరువూరు శ్రీనిధి పాఠశాలలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తిరువూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ షేక్ అబ్దుల్ నబీ, తిరు వూరు ఎంఈఓ శ్యాంసుందర్ హాజరై విద్యార్థులకు సంక్రాంతి పండుగ విశిష్టతను తెలిపారు. విద్యార్థుల వేషధారణ చూపరులను ఎంతో ఆకట్టుకున్నాయి. హరి దాసులు, గోదాదేవి ,రైతు వేషధారణ, ముగ్గుల పోటీలు, బొమ్మల కొలువులు ,భోగి పళ్ళు ,భోగిమంటలు, గంగి రెద్దుల ఆటలు పాఠశాల ఆవరణలో ఆకర్షణగా నిలి చాయి. ముగ్గుల పోటీలు, ఫ్యాన్సీ డ్రెస్ పోటీలలో విజే తలుగా నిలిచిన విద్యార్థులకు అతిథుల చేత బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాం డెంట్ ఎం.కిషోర్ బాబు, ప్రిన్సిపల్ ఆర్.వెంకటనారాయణ, హైస్కూల్ ఇన్‌ఛార్జ్ శ్రీనివాసరావు, ప్రైమరీ స్కూల్ ఇన్ ఛార్జ్ జి.పద్మావతి, ఉపా ధ్యాయులు పాల్గొన్నారు.



అంబేద్కర్‌కు నివాళి

ప్రజాశక్తి-వన్‌టౌన్: ఈ నెల 19వ తేదీన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా అంబేద్కర్ స్మృతివనం ప్రారంభించటం అభినందనీయమని 51వ డివిజన్ కార్పొరేటర్ మరుపిళ్ల రాజేష్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం 51వ డివిజన్‌లో సచివాలయం వద్ద స్టాండింగ్ కమిటీ మెంబర్, 51వ డివిజన్ కార్పొరేటర్ మరుపిళ్ళ రాజేష్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రజాభిప్రాయ సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.



ఉత్సాహంగా సంక్రాంతి వేడుకలు

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: సంక్రాంతి పండుగ సందర్భంగా నగరంలోని రెడ్‌ఎఫ్‌ఎం ఆశీర్వాద్ ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకలు నగరంలోని శ్రీ దుర్గా మల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాలలో మంగళవారం ఘనంగా జరిగాయి. ఆశీర్వాద్ మసాలా, రెడ్‌ఎఫ్‌ఎం 93.5 వారు నిర్వహించిన వేడుకల్లో విద్యార్థినీ,విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెడ్‌ఎఫ్ఎం ఆర్‌జె సుధాకర్ మాట్లాడుతూ పండుగలు వాటి విశిష్టత, మన సంస్కృతి, సంప్రదాయాలను తెలియచేసే విధంగా సంక్రాంతి వేడుకలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా ముగ్గుల పోటీలు, బొమ్మల కొలువులు, భోగి మంటలు, పిండి వంటలు, బసవన్న ఆటలు లాంటి ఎన్నో పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. సంక్రాంతి పండుగ ముందు వచ్చిందన్నట్లుగా వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలకు సిద్ధార్థ మహిళా కళాశాల డైరెక్టర్ డాక్టర్ టి.విజయలక్ష్మి బహుమతులను అందచేశారు. ఈ కార్యక్రమంలో స్విటీ, అన్యలతో పాటు స్టేషన్ హెడ్ క్రాంతి కుమార్, ప్రోగ్రామింగ్ హెడ్ ఆదిల్ బాష పాల్గొన్నారు.



కొండ ప్రాంతంలో మౌలిక సదుపాయాలు : లావణ్య

ప్రజాశక్తి-వన్‌టౌన్: స్థానిక 45వ డివిజన్‌లోని కొండ ప్రాంతంలో మౌలిక సదుపాయాల కల్పనకు కషి చేస్తున్నట్లు 45వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు మాధురి లావణ్య చెప్పారు. మంగళవారం డివిజన్‌లోని సొరంగం కొండ ప్రాంతంలో ఆమె పర్యటించి కొండ ప్రాంతంలో జరుగుతున్న అభివద్ధి పనులను పరిశీలించారు. అలాగే స్థానికుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు బి..కోటేశ్వరరావు, లక్ష్మీ, లోకేశ్వరి, ఎమినిటీస్ సెక్రెటరీ వెంకట్రావు పాల్గొన్నారు.



క్రీడా కిట్లు అందజేస్తున్న లావణ్య

బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి-భవానీపురం: క్రీడల అభివృద్ధికి సీఎం జగన్, పశ్చిమ శాసనసభ్యులు వెల్లంపల్లి శ్రీనివాసరావు ఎంతో కృషి చేస్తున్నారని 45వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు మాధురీ లావణ్య చెప్పారు. మంగళవారం లేబర్ కాలనీ గ్రౌండ్స్‌లో జరిగిన కార్యక్రమంలో ఆడుదాం ఆంధ్ర క్రీడాకారులకు బహుమతులను కార్పొరేటర్ మాధురి లావణ్య అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు బి.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.